ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

3

శుక్రవారం 28 మార్చి 2025





ఖాళీ ప్లాట్లపై కుస్తీ

- స్థలాలిచ్చి.. నిర్మాణంపై మడమ తిప్పిన గత ప్రభుత్వం
- ఇళ్లు కట్టుకోలేక ఖాళీగా వదిలేసిన పలువురు లబ్ధిదారులు
- గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 27,283 ప్లాట్లు ఖాళీ
- ఇళ్ల మధ్యలో స్థలాలతో సమస్యాత్మకంగా సర్దుబాటు

కష్టతరంగా జగనన్న కాలనీల్లోని స్థలాల సర్దుబాటు

కాలనీలు కాదు ఊళ్లు నిర్మిస్తున్నాం.. స్థలాలే కాదు ఇళ్లు కూడా కట్టిస్తాం.. సకల సౌకర్యాలతో పేదల సొంతింటి కలను నెరవేరుస్తాం.. అని గత వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల్లో లే అవుట్లు వేసి లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేసింది. అయితే అప్పట్లో ప్రభుత్వం ఇళ్ల నిర్మాణంపై మాటమార్చింది. దీంతో పలువురు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాలేదు. ఇలాంటి ఖాళీ ప్లాట్లు జగనన్న కాలనీలోని ప్రతీ లేఅవుట్లో వందల్లో ఉన్నాయి. ఖాళీ ప్లాట్లపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో పట్టణ ప్రాంతాల్లో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర ప్లాట్లు 27,283 ఖాళీగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటి పంపిణీకి ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీచేసింది. అయితే ఇళ్ల మధ్య.. ఊళ్లకు దూరంగా.. కనీస సౌకర్యాలు లేని.. చిట్టడవులను తలపిస్తోన్న.. వర్షం పడితో చెరువుల్లా మారే లేఅవుట్లలోని ప్లాట్లను ఏమి చేయాలో.. ఎలా సర్దుబాటు చేయాలనే విషయంపై అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

గుంటూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం నవరత్నాలు పేరుతో పేదల కోసం అంటూ జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి స్థలాలను పంపిణీ చేసింది. పట్టణ ప్రాంతాల్లో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర చొప్పున స్థలాలు కేటాయించింది. అయితే ప్రభుత్వ సహకారం లేకపోవడంతో ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులు ముందుకు రాలేదు. కొందరు స్తోమతకు మించి అప్పులు చేసినా ఇళ్లను పూర్తిగా నిర్మించుకోలేక వదిలేశారు. దీంతో ఆయా కాలనీలు మొండిగోడలకు పరిమితమైన ఇళ్లు, పునాదుల దశలోనే ఉన్న ఇళ్లు.. అసలు నిర్మాణాలకే నోచుకోని ఖాళీ స్థలాలతో జగనన్న కాలనీలు దర్శనమిస్తున్నాయి. అరకొర నిర్మాణాలతో ఉన్న ఇళ్లను పక్కన పెట్టి ప్రస్తుతానికి ఖాళీ స్థలాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. అయితే ఆ ఖాళీ స్థలాల సర్దుబాటు ప్రక్రియ అటు ప్రభుత్వానికి ఇటు రెవెన్యూ అధికారులకు కొత్త తలనొప్పులు తెచ్చి పెడుతోంది. ఇళ్ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాలను, సగం నిర్మాణాలున్న స్థలాలను ఎలా సర్దుబాటు చేయాలో తెలియక అధికారులు సతమతమవుతున్నారు. దీంతో స్థలాల సర్దుబాటు వ్యవహారం ఒక ప్రహసనంగా మారుతోంది. మొత్తంగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 27,283 ఖాళీ స్థలాలు ఉన్నాయి. జగనన్న లేఅవుట్లలో ఖాళీగా పడి ఉన్న స్థలాలను సర్దుబాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు చొప్పున పేదలకు స్థలాలను సర్దుబాటు చేయాల్సిందిగా రెవెన్యూ శాఖను ఆదేశించింది. అయితే ఆ ప్రకారం సర్వే చేస్తున్న అధికారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఒక లే అవుట్లో కొంత మంది ఇళ్లు కట్టుకుంటే.. మరికొందరు ఇళ్లు కట్టుకునే స్తోమత లేక ప్రభుత్వ సహాయం అందక ప్లాట్లను ఖాళీగా వదిలేశారు. అలా వదిలేసిన స్థలాలు చాలా వరకూ ఇళ్ల మధ్యలో ఉన్నాయి. ఈ సాంకేతిక సమస్య కారణంగా ప్రభుత్వం చెప్పిన 2, 3 సెంట్లు చొప్పున సర్దుబాటు చేసేందుకు వీలుపడడం లేదు. మరోవైపు ఆ స్థలాలనే వేరొకరికి ఇద్దామంటే, ప్రభుత్వం ప్రకటించిన స్థలాల కంటే చిన్నవి కావడంతో వాటిని తీసుకోవడానికి ఎవరూ ముందుకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఆయా ఖాళీ ప్లాట్లను ఏమి చేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సర్దుబాటు వ్యవహారం ఎప్పటికి కొలిక్కి వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది.

అదనపు సహాయంతో ప్రోత్సాహం

నిర్మాణం మొదలైన స్థలాలను సర్దుబాటు చేయడం వీలుకాని నేపథ్యంలో ప్రభుత్వం లబ్ధిదారులకు అదనపు సహాయం ప్రకటించి ఆ ఇళ్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా చేయూత ఇస్తుందని ఆశతో గతంలో మొదలుపెట్టిన అనేకమంది ఇళ్లు కట్టుకోలేక మధ్యలో ఆపేశారు. గుంటూరు జిల్లాలో 51,579 ఇళ్లు ఇంకా పూర్తి కావాల్సి ఉండగా 34,527 ఇళ్లు పునాదుల దశలోనే ఉన్నాయి. బాపట్ల జిల్లాలో సొంత స్థలాలున్న 20 వేల మందితో కలిపి 50,457 ఇళ్లు నిర్మించ తలపెట్టగా వాటిలో 32 వేలు అసంపూర్తిగా ఉన్నాయి. అందులో సగం జగనన్న కాలనీల్లోనే ఉన్నాయి. పల్నాడు జిల్లాలో 23,852 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. అయితే గతంలో గృహ రుణం మంజూరై ఇళ్లు నిర్మించుకోకుండా ఖాళీగా వదిలేసిన స్థలాలకు ప్రస్తుత ప్రభుత్వం అందజేసే సర్దుబాటు వర్తించదని అధికారులు చెబుతున్నారు.

కట్టుకోలేక వదిలేశారు

గత వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల్లో స్థలాలు ఇచ్చి కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే రూ.1.80 లక్షలతో ఇల్లు కట్టుకోవాలని సూచించింది. రాష్ట్రం వాటా కింద ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఆ డబ్బుతో ఇళ్లు కట్టుకోలేక నిరుపేదలు అనేక మంది స్థలాలను ఖాళీగా వదిలేశారు.

- గుంటూరు జిల్లాలో 247 లేఅవుట్లలో 73,932 ప్లాట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 63,823 ఇళ్ల నిర్మాణం ప్రారంభించగా,శంకుస్థాపనకు నోచుకోకుండా 10,109 ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి.
- బాపట్ల జిల్లాలో గత ప్రభుత్వం వేసిన జగనన్న కాలనీల్లోని లే అవుట్లలో 29,854 మందికి ప్లాట్లు ఇచ్చారు. అయితే 10,500 మంది లబ్ధిదారులు ఇళ్లు కట్టుకోలేక వదిలేశారు.
- పల్నాడు జిల్లాలో 39,642 ప్లాట్లు వేసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అయితే 9,481 ఇళ్లు పునాదుల దశలోనే ఉన్నాయి. 6,674 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాకపోవడంతో ఖాళీగా ఉన్నాయి.

లబ్ధిదారులకు రూ.50 వేలు

ఇళ్ల పనులు ప్రారంభించి మధ్యలో వదిలేసిన స్థలాలను సర్దుబాటు చేసే అవకాశం లేకపోవడంతో లబ్ధిదారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.50 వేల సహాయాన్ని ప్రకటించింది. గుంటూరు జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు 14,112 మందికి, బాపట్ల జిల్లాలో 15,334 మందికి, పల్నాడు జిల్లాలో 14,106 మందికి అదనపు ఆర్థిక సహాయం చేయనుంది.



అధ్వాన స్థితిలో నరసరావుపేటలోని కలెక్టరేట్ పక్కన ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహం



నిధులున్నా.. మరమ్మతులు మమ

- ఎస్సీ వసతిగృహాల నిర్వహణపై నిర్లక్ష్యం
- మూడు నెలల క్రితం రూ.11.43 కోట్లు విడుదల
- పల్నాడు జిల్లాలో దారుణంగా పనుల తీరు
- గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అరకొరగానే..

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రూపురేఖలు కోల్పోయిన మరుగుదొడ్లు.. పెచ్చులు ఊడు తున్న శ్లాబ్‌లు.. మెష్‌లు లేని కిటికీలు.. తలుపులు లేని గదులు.. కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న దోమల మధ్య.. ఎస్సీ సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులు అల్లాడుతున్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ హాస్టళ్ల నిర్వహణను గాలికి వదిలేశారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థుల ఇబ్బందులను పరిష్కరించేందుకు హాస్టళ్లలో మరమ్మతులు చేపట్టాలని ఆదేశించింది. విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించడంతో పాటు వసతిగృహాల్లో సమస్యలు తీర్చేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చి నిధులు విడుదల చేసింది. అయితే సదరు పనులు చేపట్టడంలో అధికారుల్లో అడుగడుగునా అలసత్వం తాండవిస్తోంది. నిధులు ఉన్నా మరమ్మతులు పూర్తి చేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. మూడు నెలల క్రితమే నిధులు విడుదలైనా నేటికి చాలా దగ్గర్ల పనులు చేపట్టలేదంటే అధికారుల అలసత్వం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నా పట్టించుకోవడంలేదు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలోని 53 వసతి గృహాల్లో మరమ్మతులకు రూ.11.43 కోట్లు నిధులు విడుదలయ్యాయి. అయితే చాలా చోట్ల పనులు చేపట్టలేదని సాంఘిక సంక్షేమశాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయి. పల్నాడు జిల్లాలో 16 వసతి గృహాలకు నిధులు కేటాయించినా ఒక్క దగ్గర కూడా పనులు పూర్తి చేయలేదు. గుంటూరు జిల్లాలో 23 వసతి గృహాలకు చాలా వసతిగృహాల్లో 50 శాతం పనులే జరిగాయి. బాపట్ల జిల్లాలో అన్ని వసతి గృహాల్లో పనులు చేపట్టగా మూడు చోట్ల 25 శాతం లోపు, 11 వసతి గృహాల్లో 50 శాతం లోపు పనులు జరిగాయి. పనులు జరుగుతున్న తీరు పరిశీలిస్తే ఇప్పట్లో అవి పూర్తయ్యే పరిస్థితి లేదని అర్థమవుతోంది. జూన్‌లో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో అప్పటి కల్లా మరమ్మతులు పూర్తి చేసేందుకు అధికారులు స్పందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

జిల్లా	వసతి గృహాలు	నిధులు (రూ.కోట్లలో)
పల్నాడు	16	2.76
గుంటూరు	23	4.13
బాపట్ల	14	4.54

సూర్యలంకకు మహర్దశ



- బీచ్ అభివృద్ధికి రూ.97.52 కోట్లు
- అంతర్జాతీయ ప్రమాణాలతో సొబగులు
- బీచ్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు కేంద్రం అనుమతి
- 45 రోజుల్లో నిధులు.. కేంద్రానిదే పూర్తి బాధ్యత : కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

బాపట్ల, గుంటూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సుందరమైన సూర్యలంక బీచ్ అత్యాధునికంగా.. సకల సౌకర్యాలతో.. పర్యాటకులను మరింత ఆహ్లాదప రచనున్నది. స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద సూర్యలంక బీచ్ అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యాటక సొబగులు అద్దుకోనుంది. బీచ్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు కింద సూర్యలంక అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద రూ.97.52 కోట్లు మంజూరు చేసింది. సూర్యలంక బీచ్‌కి సంబంధించి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేకంగా దృష్టి సారించి 45 రోజుల్లోనే నిధులు సాధించడంలో కీలకంగా వ్యవహరించారు. ఫిబ్రవరిలో కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు లేఖ రాసిన పెమ్మసాని పలుమార్లు ఆయనను వ్యక్తిగతంగా కలిసి ఈ ప్రాజెక్టుకు సంబంధించి వివరాలు అందజేసి నిధులు రాబట్టడంలో విజయం సాధించారు. కేంద్రం విడుదల చేసిన నిధులను 7 అంశాలపై ఖర్చు చేయనున్నారు. రూ.15.43 కోట్లతో పర్యాటకుల అనుభూతిని పెంచేలా కార్యక్రమాలు, రూ.4.4 కోట్లతో షాపింగ్ స్ట్రీట్, రూ.7.8 కోట్లతో రవాణా సదుపాయాలు, రూ.11.69 కోట్లతో బీచ్ సమీపంలోని కాల్వ అభివృద్ధి, రూ.19.4 కోట్లతో ఎక్స్‌పీరియన్స్ జోన్, రూ.12.8 కోట్లతో సదుపాయాలు, రూ.5.97 కోట్లతో సౌకర్యాలు అందుబాటులోకి తేనున్నారు. సూర్యలంకకు ప్రాజెక్టు మంజూరు చేయించడం తనకు చాలా ఆనందంగా ఉందని పెమ్మసాని గురువారం తెలిపారు. ఈ ప్రాజెక్టుకు అయ్యే పూర్తి ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

సమకూరే వసతులు..

- బ్లూఫ్లాగ్ గుర్తింపు దక్కేలా వసతుల కల్పన
- కొత్తగా రిసార్టుల నిర్మాణం, తాత్కాలిక గదుల ఏర్పాటు
- పర్యాటకులను ఆకర్షించేలా బీచ్ ఆధునికీకరణ
- దేశీయ సాంప్రదాయ ఫుడ్ స్టాళ్లు, షాపింగ్ స్ట్రీట్ ఏర్పాటు
- పిల్లలకోసం ప్రత్యేక ఆట వస్తువులు, పార్కు నిర్మాణం

చక్రం తిప్పిన పెమ్మసాని..

స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద కేంద్రం తొలుత రూ.600 కోట్ల బడ్జెట్‌తో దేశ వ్యాప్తంగా ఆరు ప్రాజెక్టులను చేపట్టింది. ఈ పథక నిర్వహణలో సాంకేతిక సర్దుబాట్ల బాధ్యతను పెమ్మసాని ప్రత్యేకంగా చేపట్టారు. ఈ క్రమంలో ఆరు ప్రాజెక్టులను 14 ప్రాజెక్టులుగా మార్పు చేయించారు. బడ్జెట్‌ను కూడా రూ.600 నుంచి 1,000 కోట్లకు పెంచేలా చేశారు. సూర్యలంక బీచ్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును కూడా ఇందులో జత చేయించడంలో పెమ్మసాని చక్రం తిప్పారు. సూర్యలంక బీచ్ ప్రాముఖ్యత, పర్యాటకంగా పెరగనున్న ఆదరణ, తదితర వివరాలను సవివరంగా డీపీఆర్ ద్వారా కేంద్ర పర్యాటకశాఖకు పలుమార్లు పెమ్మసాని వివరించడంతో సంతృప్తి వ్యక్తం చేసిన కేంద్రం నిధులను విడుదల చేసింది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.25 (శుక్రవారం సాయంత్రం)

సహరి : 4.49 (శనివారం ఉదయం)

శివార్లకు.. ఎక్కిళ్లు

- గుంటూరులో పొంచి ఉన్న నీటి ఎద్దడి
- పలు ప్రాంతాల్లో రెండు రోజులకు ఒక్కసారే సరఫరా
- నగరంలో ఎండిపోయిన చెరువులు.. అడుగంటిన భూగర్భ జలాలు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో చెరువులు నీరు లేక ఎండిపోయాయి. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. అదే సమయంలో కార్పొరేషన్ తాగునీటి సరఫరాలో అవాంతరాలు నెలకొంటున్నాయి. దీంతో నగర శివార్లు, విలీన గ్రామాల్లో తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారు. నగరంలో కూడా కొన్ని ప్రాంతాల్లో ప్రస్తుతం రెండు రోజులకు ఒకసారి మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారు. మార్చిలోనే ఇలా ఉంటే నిండు వేసవి ఏప్రిల్, మేలో పరిస్థితి ఏమిటోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ ఏడాది వేసవిలో నగరంలో తాగునీటి సమస్య జటిలంగా మారే అవకాశం ఉందని అర్థమవుతోంది. వేసవిలో తాగునీటిపై ముందస్తు ప్రణాళిక గురించి అధికారులు ఇప్పటి వరకు ఆలోచన చేయలేదన్న విమర్శలున్నాయి. తాగునీటి ఎద్దడిని నివారించేందుకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజల ఆందోళన చెందుతున్నారు. ముందస్తుగా బోర్ల మరమ్మతులు, కొరిటెపాడు, గార్డెన్స్ చెరువులకు నీరు నింపడం, పైప్‌లైన్‌లేని ప్రాంతాలకు ట్యాంకర్ల ఏర్పాటు వంటి చర్యలు ఇప్పటి వరకు చేపట్టలేదు. నగరంలో ప్రజలకు 24/7 తాగునీటి సరఫరా అనేది అసాధ్యంగా మారింది. ఇప్పటికే పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని అనేక ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో నీరు అందడం లేదు. ప్రధానంగా ఎస్వీఎన్‌కాలనీ, నేతాజీనగర్, వైష్ణవినగర్, తారకరామనగర్, అంబేద్కర్‌నగర్, వైశ్యా బ్యాంక్ కాలనీ, టెలికంనగర్, హిమనినగర్, ద్వారకానగర్, ముత్యాలరెడ్డినగర్, విద్యానగర్ శివారు ప్రాంతాలకు సక్రమంగా నీటి సరఫరా జరగడంలేదు. ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని స్వర్ణభారతినగర్, జర్నలిస్ట్ కాలనీ, రాయపాటి శ్రీనివాస్‌కాలనీ, వెంకటేశ్వరకాలనీ, ఇన్నర్‌రింగ్‌రోడ్డులోని కాలనీలు, తూర్పు నియోజకవర్గంలోని జానీనగర్, రాహుల్‌గాంధీనగర్, లక్ష్మీనగర్, ప్రగతినగర్, తారక రామానగర్ తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్య నెలకొంది. ఏసుభక్తనగర్, కిడంబినగర్, శుద్ధపల్లిడొంక, రెడ్డిపాలెం శివార్లు, ఆటోనగర్, మద్దిరాలకాలనీ, ఎన్టీఆర్‌కాలనీ, వాసవినగర్, రాజగోపాల్‌నగర్, మంగళదాస్‌నగర్ ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. నగర చుట్టుపక్కల ఉన్న గోరంట్ల, రెడ్డిపాలెం, అడవి తక్కెళ్ళపాడు, పలకలూరు, నల్లపాడు, అంకిరెడ్డిపాలెం, లాలుపురం, పొత్తూరు, జొన్నచుండూరు, ఏటుకూరు, బుడంపాడు తదితర విలీన గ్రామాల్లో తాగునీటికి ప్రజలు అల్లాడుతున్నారు.

నగరంలోని కొరిటెపాడు, బృందావన్ గార్డెన్స్ చెరువులను వేసవికి ముందు నీరు నింపి ఉంచుతారు. చెరువులో నీరు ఉండటంతో పరిసర ప్రాంతాల్లో రెండు కిలోమీటర్ల వరకు పుష్కలంగా భూగర్భ జలాలతో బావులు, బోర్లలో నీరు అందేది. అయితే ఈ ఏడాది ఈ రెండు చెరువుల్లో నీరు లేదు. భూగర్భ జలాలు అడుగంటి బోర్లు, బావులు నిరుపయోగంగా మారుతున్నాయి.



ఎండిపోయిన కొరిటెపాడు చెరువు



శివార్లలో డ్రమ్ముల్లో నీరు

రాజధానిలో పీ-4 ప్రారంభోత్సవానికి సిద్ధం

ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ సతీష్‌కుమార్

తుళ్లూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న పీ-4 ప్రారం భోత్సవానికి అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశారు. ఉగాది పర్వదినం రోజున జరిగే ఈ కార్యక్రమానికి వెలగపూడిలోని సచివాలయం వెనక ప్రాంగణాన్ని సిద్ధం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం సాయంత్రానికి ఏర్పాట్లు పూర్తి కానున్నాయి. ఏర్పాట్లను గురువారం ఎస్పీ సతీష్‌కుమార్ పరిశీలించారు. పోలీసు బందోబస్తు గురించి అధికారులకు సూచనలు చేశారు.



కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

గుంటూరు-నడికుడి మార్గంలో రైళ్ల వేగం 130 కి.మీ

తొమ్మిదో తరగతి విద్యార్థినితో బీటెక్ విద్యార్థి పెళ్లి - 8 నెలలు తిరగకుండానే పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కిన బాధితురాలు

చెరువులో పడి బీసీ హాస్టల్ విద్యార్థి మృతి

రూ.13 కోట్లతో డీసీఎంఎస్ బడ్జెట్ ఆమోదం

4



వివరాలు తెలియజేస్తున్న డాక్టర్ వివేక్, పక్కన కోలుకున్న రోగి

కిమ్స్ హాస్పిటల్స్‌లో..

క్లిష్టమైన మెదడు శస్త్రచికిత్స

గుంటూరు మెడికల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌లో క్లిష్టమైన పక్షవాత కేసుకు అరుదైన రీతిలో కెరోటిడ్ ఆర్టరీ స్టెంట్, ఎన్యురిజమ్ కాయిలింగ్ విధానంతో విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. గురువారం కిమ్స్ హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను తెలిపారు. 76 సంవత్సరాల రోగి పక్షవాతం బారిన పడి చికిత్స పొందుతున్నా, శరీర భాగం తరచూ బలహీనతనకు గురికావడం, ఇతర ఇబ్బందులు ఏర్పడుతుండటంతో ఇటీవల కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌లో చేరారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ ప్రదీప్ కుమార్‌రెడ్డి రోగిని పరీక్షించి మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే కెరోటిడ్ ధమనుల్లో కొవ్వు పేరుకుపోయినట్లు గుర్తించారు. న్యూరో సర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణ్‌రావు నేతృత్వంలో బ్రెయిన్ యాంజియోగ్రామ్ చేయగా, మెదడు రక్తనాళం కూడా బలహీనపడి ఉబ్బి బుడగ మాదిరిగా మారినట్లు (ఎన్యురిజమ్) గుర్తించారు. డ్యూయల్ యాంటీ ప్లేట్‌లెట్‌ల థెరపీ ఉపయోగించి రోగికి చికిత్స చేయాలని నిర్ణయించారు. ఇంటర్వెన్షనల్ స్పెషలిస్ట్ డాక్టర్ వివేక్, ఏకకాలంలో కెరోటిడ్ ఆర్టరీ స్టెంట్ వేయడంతోపాటు బ్రెయిన్ ఎన్యురిజమ్‌కు కాయిలింగ్ పద్ధతిలో చికిత్స చేశారు. ఆపరేషన్ అనంతరం రోగి ఆరోగ్యపరంగా పూర్తిగా కోలుకున్నారు. సమావేశంలో ఎమర్జెన్సీ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ రాజశేఖర్ మాలెంపాటి, సీవోవో సుధాకర్ పాల్గొన్నారు.

ఆప్కో చేనేత వస్త్రాలపై 30 శాతం ప్రత్యేక తగ్గింపు

గుంటూరు సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకొని అన్ని రకాల ఆప్కో చేనేత వస్త్రాలపై 30 శాతం ప్రత్యేక తగ్గింపును అమలు చేయనున్నట్లు వాణిజ్య అధికారి డి వెంకటేశ్వర్లు తెలిపారు. కొన్ని రకాల చేనేత వస్త్రాలపై 50 శాతం వరకు తగ్గింపు కూడా ఇస్తున్నామని తెలిపారు. జిల్లా ప్రజలందరూ సమీపంలో ఉన్న ఆప్కో విక్రయశాలలను సందర్శించి కావలసిన వెంకటగిరి, మాధవరం, రాజమండ్రి, బందరు, చీరాల, ఉప్పాడ చీరలు, ధోవతులు, దుప్పట్లు, లుంగీలు, షర్టింగ్, టవల్స్ తదితర చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గుంటూరు-నడికుడి మార్గంలో రైళ్ల వేగం 130 కి.మీ

● రూ. 17.31 కోట్లతో ట్రాక్ వెంట సరిహద్దు గోడ నిర్మాణం ● టెండర్ల ప్రక్రియ ప్రారంభించిన దక్షిణ మధ్య రైల్వే

గుంటూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - నడికుడి - పగిడిపల్లి సెక్షన్‌లో రైళ్ల వేగాన్ని 130 కిలోమీటర్ల కంటే ఎక్కువ చేసేందుకు రైల్వే శాఖ ఉపక్రమించింది. ఇప్పటివరకు 110 కిలోమీటర్ల గరిష్ట వేగానికే పరిమితమైన ఈ సెక్షన్‌ని అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం సెక్షన్‌లో ఎక్కడైతే రైలుపట్టాల పైకి ట్రెస్ పాసింగ్ జరగడానికి ఎక్కువగా అవకాశాలున్నాయో అక్కడ ట్రాక్ పొడవునా ప్రహరీగోడ నిర్మించేందుకు అన్ని అనుమతులను తీసుకొని టెండర్ల ప్రక్రియని ప్రారంభించింది. కొద్ది రోజుల్లో ఏజెన్సీలను ఖరారు చేసి రెండుగా విభజన చేసిన ఈ ప్రహరీగోడ నిర్మాణ పనులను కేటాయించనుంది. ఈ పనులు పూర్తి అయితే సెక్షన్ స్పీడ్ లిమిట్‌ని పెంచేందుకు అవకాశం ఉంటుందని రైల్వేవర్గాలు తెలిపాయి.

గుంటూరు రైల్వే డివిజన్‌లో ఏ సెక్షన్ చూసినా 130 కిలోమీటర్ల కంటే గరిష్ఠ వేగంతో రైళ్లు ప్రయాణించేందుకు అనుమతి లేదు. ఇందుకు కారణం డబ్లింగ్‌లు సంపూర్ణం కాక పోవడం, ఎక్కువ రద్దీ ఉండే నడికుడి మార్గంలో సింగిల్ లేన్ ఉండటమే. దీంతో ఒకదశలో వందేభారత్ లాంటి ప్రీమియం రైళ్లను నడిపేందుకు రైల్వే శాఖ వెనకడుగు వేసింది. అయితే ప్రజాప్రతినిధుల విజ్ఞప్తులు, అధికారుల ప్రతిపాదనల మేరకు ఒకే ఒక్క వందేభారత్ (సికింద్రాబాద్ - తిరుపతి - సికింద్రాబాద్) రైలుని రైల్వేబోర్డు గుంటూరు డివిజన్ మీదగా నడిపేందుకు అనుమతించింది. మరోవైపు జోన్‌లోని ఇతర డివిజన్లు అయిన విజయవాడ, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్, గుంతకల్లులో ఎక్కువ వందేభారత్‌తో పాటు ఇతర ప్రీమియం రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి.

వీటిని పరిగణనలోకి తీసుకొన్న రైల్వే అధికారులు తొలుత గుంటూరు - నడికుడి - పడిగిపల్లి సెక్షన్‌ని 130 కిలోమీటర్ల వేగానికి మించి రైళ్లు ప్రయాణించేలా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ఈ సెక్షన్‌లో డబ్లింగ్ ప్రాజెక్టు కూడా మంజూరైంది. దీంతో గుంటూరు - నడికుడి సెక్షన్‌లో 9.84 కిలోమీటర్ల పొడవునా ప్రహరీగోడ నిర్మాణం చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ. 9.77 కోట్లు ఖర్చు అవుతుంది. ఈ పనులను ఏడాదిన్నర లోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. అలానే పడిగిపల్లి - నడికుడి సెక్షన్‌లో 7.56 కిలోమీటర్ల పొడవునా నిర్మించనున్న ప్రహరీగోడకు రూ. 7.53 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఈ పనిని కూడా పూర్తి చేసేందుకు 18 నెలల సమయాన్ని కేటాయించింది. ఈ రెండు సెక్షన్లలో ప్రహరీగోడ నిర్మాణ పనులు పూర్తయితే రైల్వేట్రాక్‌ల పైకి ట్రెస్‌పాసింగ్‌కు అడ్డుకట్ట పడుతుంది. దాంతో గరిష్ఠ వేగంతో రైళ్లు నడపడానికి ఆస్కారం ఉంటుంది.

చెరువులో పడి బీసీ హాస్టల్ విద్యార్థి మృతి



విద్యార్థి మృతదేహం వద్ద విలపిస్తున్న తండ్రి వెంకటేశ్వర్లు, బంధువులు (ఇన్‌సెట్‌లో) కిషోర్

వట్టిచెరుకూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వట్టిచెరుకూరు గ్రామంలోని బీసీ హాస్టల్‌లో ఉంటూ స్థానిక జడ్పీ హైస్కూల్లో 9 తరగతి చదువుతున్న బిక్కం కిషోర్(14) అనే విద్యార్థి హాస్టల్ సమీపంలోని మంచినీటి చెరువులో నీటి కోసం వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. అదేప్రాంతంలో తోటి విద్యార్థులు ఇద్దరు స్నేహితుడిని కాపాడే ప్రయత్నంలో నీట మునిగి ప్రమాదంలో చిక్కుకున్నారు. వారిని అక్కడికి సమీపంలో ఉన్న 108 అంబులెన్స్ సిబ్బంది, గ్రామస్థులు కాపాడారు. ముందుగా నీట మునిగిన కిషోర్ జాడ కన్పించకపోవటంతో గ్రామసర్పంచ్ విజయకుమార్, ఉపసర్పంచ్ యడ్లపల్లి సత్యనారాయణ, ఎంపీటీసీ భీమినేని కోటేశ్వరరావు, హాస్టల్ వార్డెన్, గ్రామస్థుల సహకారంతో చెరువులో వెతకగా అప్పటికే విద్యార్థి కిషోర్ మృతి చెందినట్టుగా గుర్తించి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. హాస్టల్ విద్యార్థి చెరువులో మునిగి మృతి చెందడంతో తోటి విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. నీటమునిగిన విద్యార్థి కిషోర్ ఐదు సంవత్సరాలుగా వట్టిచెరుకూరు బీసీ హాస్టల్‌లోనే ఉంటూ చదువుకుంటున్నాడు. సంఘటన తెలిసిన వెంటనే సీఐ రమానాయక్, హాస్టల్ వార్డెన్ నుంచి బాలుడి వివరాలు సేకరించి తల్లిదండ్రులకు సమాచారాన్ని అందించారు. వివరాల్లోకి వెళితే పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గంగలకుంటకు చెందిన బిక్కం వెంకటేశ్వర్లు, రాములుకు ముగ్గురు కుమారులు. మూడో కుమారుడు మృతుడు కిషోర్ ఐదు సంవత్సరాలుగా ఇదే హాస్టల్‌లో ఉంటూ జడ్పీ హైస్కూల్లో చదువుతున్నాడు. సీఐ నుంచి బాలుడి ఘటన వివరాలు తెలుసుకున్న వెంటనే తల్లి రాములు స్పృహ కోల్పోయింది. తండ్రి, బంధువులతో కలసి హుటాహుటీన వట్టిచెరుకూరు చేరుకున్నారు.

గురువారం ఉదయం హాస్టల్‌కు నీరు రాకపోవటాన్ని గుర్తించి విద్యార్థులు వార్డెన్ సాంబశివరావుకు చెప్పారు. దీంతో పంచాయతీ వారిని సంప్రదించగా ప్రస్తుతం మోటారు రిపేర్లు చేస్తున్నామని, కొద్ది సమయంలో నీరు ఇస్తామని నీరు విడుదల చేసే వ్యక్తి చెప్పాడు. నీరు అత్యవసరమని అనటంతో వార్డెన్ సాంబశివరావు చెరువు దగ్గరకు వెళ్ళి కొంచం నీరు తెచ్చుకోండని చెప్పటంతో మృతుడు కిషోర్, అతనితో పాటు మరో ఇద్దరు విద్యార్థులతో కలసి మంచి నీటి చెరువులో నీరు తెచ్చుకొనే ప్రయత్నంలో కాలు జారి కిషోర్ నీటిలోకి జారాడు. తోటి విద్యార్థులు కిషోర్‌ను కాపాడే ప్రయత్నంలో వారు కూడా నీటిలో మునిగి పోవటాన్ని సమీపంలో ఉన్న 108 సిబ్బంది పెద్దగా కేకలు వేస్తూ తోటి వారి సాయంతో ఇద్దరు విద్యార్థులను కాపాడారు. గ్రామస్థుల సహకారంతో అదే ప్రాంతంలో వెతకటం ప్రారంభించగా అప్పటికే కిషోర్ మృతి చెందటాన్ని గుర్తించి మృత దేహాన్ని ఒడ్డుకు చేర్చారు. సంఘటన తెలిసిన వెంటనే బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ మయూరి, ఎంపీడీవో రవిబాబు, డీటీ దరియావలి ఆ ప్రాంతానికి చేరుకొని సంఘటనా తీరును పరిశీలించి మృతుని తండ్రిని ఓదార్చిన అనంతరం మృత దేహాన్ని గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. మృతుడి తండ్రి విలపిస్తుండగా బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ మయూరి అయనను ఓదారుస్తూ జరగరాని ఘోరం జరిగింది, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామంటూ స్థానిక హాస్టల్ వార్డెన్ సాంబశివరావుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డెన్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలంటూ ఆమె లిఖిత పూర్వకంగా సూచించారు.

విద్యార్థి దుర్మరణం బాధాకరం : మంత్రి సవిత

● వార్డెన్ సస్పెన్షన్‌కు ఆదేశం

గుంటూరు (విద్య), మార్చి 27(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు బీసీ హాస్టల్ విద్యార్థి కిశోర్ చెరువులో పడి దుర్మరణం పాలవ్వడంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థులపై పర్యవేక్షణ లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన హాస్టల్ వార్డెన్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని మంత్రి ఆదే శించారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రమాదవ శాత్తు గురువారం ఉదయం చెరువులో పడి కిశోర్ దుర్మరణం పాలవ్వడం బాధాకరమన్నారు. విద్యార్థి తల్లిదండ్రులకు మంత్రి సవిత తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. దుర్ఘటనకు గల కారణాలపై విచారణకు ఆదేశించామన్నారు.

విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోండి

హాస్టల్ విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోవాలని వార్డెన్లకు, ఇతర సిబ్బందికి మంత్రి సవిత స్పష్టం చేశారు. ప్రభుత్వంపైనా, అధికారులపైనా నమ్మకంతో తమ పిల్ల లను హాస్టళ్లలో చేర్పుతున్నారన్నారు. తల్లిదండ్రులు కంటనీరు పెట్టకుండా, గర్వపడేలా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత హాస్టల్ సిబ్బందిపై ఉందన్నారు. వట్టిచెరుకూరు వంటి ఘటనలు జరగడం క్షమించరాని నేరమన్నారు.

రూ. 13 కోట్లతో డీసీఎంఎస్ బడ్జెట్ ఆమోదం



జేసీ భార్గవ్‌తేజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బీఎం హరగోపాల్

గుంటూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ది గుంటూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీకి 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 13 కోట్లతో బడ్జెట్ ఆమోదం లభించింది. మెడికల్ కళాశాల రోడ్డులో వున్న కార్యాలయంలో డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న జాయింట్ కలెక్టర్ ఎ భార్గవ్‌తేజ అధ్యక్షతన గురువారం మహాజన సభ జరిగింది. ఈ సందర్భంగా జేసీ అధ్యక్షతన బడ్జెట్‌కు సంబంధించిన వివరాలను, సొసైటీ ముఖ్య లక్ష్యాలను బిజినెస్ మేనేజర్ హరగోపాల్ ప్రసంగించారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ 2025-26కు సంబంధించి రూ. 13 కోట్లతో బడ్జెట్‌ను సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సభ్యులెవరూ అభ్యంతరాలు తెలియజేయకపోవటంతో బడ్జెట్‌ను ఆమోదిస్తూ తీర్మానం చేశారు. కార్యక్రమంలో కార్యాలయ మేనేజర్ శ్రీనివాసరావు తదితరులున్నారు. అలానే జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సమావేశం పర్సన్ ఇన్‌ఛార్జ్, జేసీ ఏ భార్గవ్‌తేజ అధ్యక్షతన గురువారం బ్రాడీపేటలోని బ్యాంకు కార్యాలయంలో జరిగింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 535 కోట్లతో బడ్జెట్ ఆమోదానికి తీర్మానం చేశారు. బ్యాంకు సీఈవో కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె బడ్జెట్‌కు సంబంధించిన అంశాలను చదివి సభ్యులకు వినిపించారు. బడ్జెట్ ఆమోదం తెలపాలని సభ్యులను కోరగా ఎవరూ అభ్యంతరాలు వ్యక్తం చేయకపోవటంతో ఆమోదం తెలుపుతూ తీర్మానం చేశారు.

తొమ్మిదో తరగతి విద్యార్థిని ప్రేమ పెళ్లి చేసుకున్న బీటెక్ విద్యార్థి

- 8 నెలలు తిరగకుండానే పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కిన బాధితురాలు

గుంటూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : 9వ తరగతి చదువుతున్న బాలికను బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. బాలికను పెళ్లి చేసుకుని ఆమె ఇంట్లోనే కాపురం కూడా ఉంటున్నారు. ఆ యువకుడు కాలేజీకి, బాలిక స్కూల్‌కు వెళ్తూనే ఉన్నారు. పెళ్ళై ఎనిమిది నెలలు కూడా గడవక మునుపే బాలిక పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది... ఈ కేసుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే... గుజ్జనగుండ్ల వాకింగ్ ట్రాక్ వెనుక ప్రాంతానికి చెందిన కోడూరి సంజయ్ (19) బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. స్తంభాల గరువు ప్రాంతానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని (14)తో పరిచయం ఏర్పడి ఇరువురు ప్రేమించుకుని పెద్దలకు తెలియకుండా పెళ్లి చేసుకున్నారు. విషయం తెలుసుకున్న బాలిక కుటుంబ సభ్యులు వారి పెళ్లిని అంగీకరించి, వారువురిని తమ ఇంటిలోనే ఉంచుకున్నారు. ఇరువురు మేజర్లు అయ్యేవరకు చదువుకునేలాగా బాలిక కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఈ క్రమంలో బాలిక స్కూలుకు, సంజయ్ ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లి చదువుకుంటున్నారు. అయితే ఇటీవల బాలిక తన ఫోన్లో వేరే వారితో చాట్ చేస్తుండడం గమనించిన సంజయ్ విషయాన్ని తన అత్తమామలకు చెప్పాడు. బాలికను మందలించకపోగా సంజయ్‌ను తప్పుపట్టారు. ఈ విషయమై రెండు కుటుంబాల మధ్య వివాదం నెలకొనగా బాలిక తరఫు వారు సంజయ్ కుటుంబ సభ్యులపై దాడి చేసి కొట్టారు. ఈ క్రమంలో సంజయ్ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా మైనర్‌ని పెళ్లి చేసుకున్న వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఇరువర్గాలను పిలిపించి విచారించగా సంజయ్ మైనర్‌ను వివాహం చేసుకున్నట్లు నిర్ధారణ అయింది. దీంతో బాలిక కుటుంబ సభ్యుల నుంచి పోలీసులు ఫిర్యాదు తీసుకొని సంజయ్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చిలకలూరిపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట బైపాస్ రోడ్ లో గురువారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండలం సిద్దవరం గ్రామానికి చెందిన చప్పిడి రమేష్(25), అతడి చిన్నాన్న కొడుకు చప్పిడి చిన్న(19) ద్విచక్ర వాహనంపై వెళ్తూ వారి ముందు వెళుతున్న లారీని వెనుక వైపు నుంచి ఢీకొట్టారు. దీనితో ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న చప్పిడి రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. చప్పిడి చిన్న తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఎంపీపీగా జబీన్‌కు ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ప్రిసైడింగ్ అధికారి పి.శంకర్

దుగ్గిరాల ఎంపీపీగా షేక్ జబీన్

దుగ్గిరాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన ఎంపీపీ ఎన్నికలో చిలువూరు ఎంపీటీసీ షేక్ జబీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జబీన్‌కు బీసీ ధ్రువీకరణ పత్రం ఇవ్వకపోవడంతో సంఖ్యాబలం లేకపోయినప్పటికీ వైసీపీ సభ్యురాలు ఎంపీపీగా ఎంపికైన విషయం విధితమే. గురువారం జరిగిన ఎన్నికలో ఎంపీపీగా జబీన్‌ను ఎన్నుకున్నారు. వైసీపీ సభ్యులు గైర్హాజరు కాగా, టీడీపీ సభ్యులు తొమ్మిది మంది, జనసేన సభ్యురాలు ఒకరు మొత్తం పదిమంది సభ్యులు హాజరుకావడంతో ఎన్నికకు అవసరమైన కోరం లభ్యమైంది. ఎన్నికల అధికారి డ్వామా పీడీ పి.శంకర్ ఎన్నిక ప్రక్రియను ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యుల హాజరు తీసుకున్న ప్రిసైడింగ్ అధికారి ప్రతిపాదించే సభ్యుడు, బలపరిచే సభ్యుడు ముందుకు రావాలని కోరారు. గొడవర్రు సర్పంచ్ విశ్వనాధపల్లి శివకుమార్, ఎంపీపీగా పోటీ చేసేందుకు టీడీపీ నుంచి బీఫారం అందుకున్న, చిలువూరు ఎంపీటీసీ జబీన్ పేరును ప్రతిపాదించగా రేవేంద్రపాడు ఎంపీటీసీ కొప్పుల మధుబాబు ఎంపీపీగా బలపరుస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎన్నికకు హాజరైన సభ్యులందరూ జబీన్ ఎన్నికకు ఆమోదం తెలిపారు. జబీన్ దుగ్గిరాల ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం ఆమె ప్రమాణ స్వీకారం చేశారు. ఎంపీడీవో అడిగొప్పుల శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ చంద్రమోహన్, టీడీపీ, జనసేన ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 13న పరీక్ష

యడ్లపాడు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు సంబంధించిన ప్రవేశ పరీక్ష వాయిదా వేసినట్లు బోయపాలెం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 6వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రకటన జారీచేసిందన్నారు. అయితే ఆ రోజు శ్రీరామనవమి పండుగ కావడంతో పరీక్షను వాయిదా వేసిందన్నారు. తిరిగి ఏప్రిల్ 13వ తేదీ ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించాలని నిర్ణయించిందని, ఉదయం 5వ తరగతి ప్రవేశాలకు, మధ్యాహ్నం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు గమనించి పరీక్షలకు సన్నద్ధం కావాలని కోరారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 521.40 అడుగులు ఉంది. కుడికాలువ ద్వారా 6041 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8454 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో 16,595 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 25,123 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పొన్నూరు పురపాలక సంఘం, పొన్నూరు

ఆర్.ఓ.సి.నెం.1755/2015/జి1 తేది.27.03.2025

ప్రకటన

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వులు నెం. 650 యం.ఏ. అండ్ యుడి. తేది. 27.10.1993 మాస్టర్ ప్లాన్ ప్రకారం పొన్నూరు పురపాలక సంఘ పరిధిలో జి.బి.సి. రోడ్డును అభివృద్ధి చేయుటలో భాగంగా రూరల్ పోలీస్ స్టేషన్ నుండి కొప్పాక వెంకయ్య కూరగాయల మార్కెట్ వరకు 60 అడుగుల రోడ్డు విస్తరణ జరిగినది. సదరు రోడ్డు విస్తరణలో స్థలం కోల్పోయిన యజమానుదారులకు టిడిఆర్ (ట్రాన్స్‌ఫర్బుల్ డెవలప్మెంట్ రైట్స్) బాండ్లు జారీ చేయు విషయమై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ డిపార్టుమెంట్ జి.ఓ.ఎం.ఎస్.నెం.4, తేది. 09.01.2025 ప్రకారం టిడిఆర్ ప్రతిపాదనలను స్క్రూటినీ కమిటీలో ఉంచడానికి ముందు పేపరు నోటిఫికేషన్ ద్వారా ఏమైనా క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాలు ఉంటే 7 రోజుల్లోగా తెలియజేయమని ఆదేశాలు జారీ చేసియున్నారు. ఇందుకు సంబంధించి స్థల యజమానుల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నవి.

S.No	Structure Number	Name of the Building or Site Owner	Registered Deed Number	Extent of Land Affected Sq.Mts	Door Number	Survey Number
1	L-2	Kothuri Ananda Kumar	449/2014	15.55	1-1-45/1	385-6A1B
2	L-2A	Kothuri Sathyanarayana	449/2014	10.57	1-1-45	385-6A1B
3	L-4	Majeti Srinivasa Rao	2035/1994	9.11	1-1-46	385-6A1B
4	L-6	Alapati Venkata Satya Sai Suresh	33/2020	6.65	1-1-48	385-6A1B
5	R-13	Paturi Seshamma	12/1996	80.92	24-1-54	380-5
6	R-15	Ghantasala Krishna Kumari	55/1981	24.26	24-1-51/A	380-5
7	R-73	Shaik Ilahi Bakshi	3693/2022	0.784	16-8-2	399-1
8	R-73A	Shaik Ilahi Bakshi	989/1995	6.27	16-8-1	399-1
9	R-74	Shaik Ilahi Bakshi	468/1977	5.786	16-8-1/A	399-1
10	R-76	Shaik Shafaithulla	7359/2024	2.29	16-1-19/4	399-1
11	L-71	Padavala Veera Venkata Satyanarayana	394/1998	21.09	2-1-75	385/6A1G
12	L-73	Chebrolu Srinivas	270/1968	6.42	2-1-77	385/6A1G
13	L-74	Chebrolu Veeranjaneyulu	1547/1954	2.90	2-1-78	385/6A1G
14	L-75	Khasim Md	1250/1991	14.11	2-1-78	385/6A1G
15	L-75A	Khasim Md	1251/1991	15.74	2-1-78	385/6A1G
16	L-38	Kollipara Sreerama Chandramurthy	1486/1983	3.53	2-1-34	385/6A1E
17	R-36	Yama Lakshmana Rao	1145/1980	2.98	24-1-24	380/5
18	R-53	Kollipara Surya Teja	2810/2016	2.62	23-1-24	380/5
19	L-13	Pokuri Kusuma Hara Gopal	62/2022	5.03	2-1-14	385-6A1C
20	L-8	Konduru Venkata Subbarao	323/2011	2.25	1-1-50	385-6A1B
21	L-42	Tunuguntla Umamaheswara Rao	3/2025	15.17	2-1-38	385-6A1E
22	L-41	Avvaru Bharathi Devi	1870/1966	10.31	2-1-37	385-6A1E
23	L-40	Avvaru Annapurna Devi	1870/1966	18.07	2-1-36	385-6A1E
24	L-14	Alapati Sivannarayana	210/1993	4.97	2-1-14/A	385-6A1C
25	R-2	Vemuri Srinivasa Rao, Vemuri Damodara Rao	952/2003	8.85	24-1-64	380-5
26	L-44	Chebrolu Mahalakshmi	38/1982	9.03	2-1-40	385-6A1E
27	L-47B	Allam Mary Roope	1735/2001	2.60	2-1-45, 2-1-44/1	385-6A1E
28	L-47	Allam Venkata Srirama Murthy	2095/2002	3.94	2-1-45. 2-1-44/1	385-6A1E
29	L-47A	Allam Mary Roopa	1243/2001	2.60	2-1-45. 2-1-44/1	385-6A1E
30	L-27	Vakkalagadda Srinivasa Rao	3135/2013	7.52	2-1-25/1	385-6AID
31	R-45	Avvaru Sampath Kumar	117/2015	8.75	24-1-8	380-5
32	L-33	Karumuri Sankara Rao	281/2023. 282/2023	15.48	2-1-29	385-6A1E
33	L-59	Chunduru Ramamurthy	1243/2019	11.66	2-1-57	385-6A1E
34	L-60	Chebrolu Sri Mahalakshmi	630/1976	16.935	2-1-56	385-6A1E
35	R-49	Kurapati Venkateswara Rao	1546/1993	1.04	23-1-28	380-5
36	L-79	Garlapati Seetha Mahalakshmi	1640/2007	4.75	2-1-82	385-6A1G
37	L-80	Chebrolu Basavaiah	1154/2012	2.65	2-1-82/1	385-6A1G
38	L-77	Dogiparthy Kusumakumari	661/1957	6.32	2-1-80	385-6A1G
39	L-78	Kottagunda Venkata Naga Samba Siva Rao	109/1995	10.92	2-1-81	385-6A1G
40	L-76	Sajja Hemalatha	69/2003. 68/2003	33.69	2-1-79	385-6A1G
41	R-63	Nagasuri Mohit Bhanu Teja	2314/2015	4.27	23-1-10	380-5
42	R-60	Maturi Sivaparvathi	856/2018	3.67	23-1-13/A	380-5
43	L-26	Chimakurthi Chandra Sekhara Rao	677/2012	11.7	2-1-25	385-6A1D
44	R-64	Alapati Subbarayudu	659/1972	3.53	23-1-11	380-5
45	R-35	Devathi Lakshmi Kumari	2331/2020	3.63	24-1-25	380-5
46	R-34	P. Lakshmi Neeraja Padma	1036/2023	17.15	24-1-26	380-5
47	L-67	Kotha Surya Narayana	1928/2015	18.87	2-1-64	385-6A1F
48	R-71	Mohammad Khasim	54/2003	7.39	22-3-1/1	380-5
49	R-70	Shaik Saleem. Shaik Shamshuddin	53/2003	4.30	22-3-1/2	380-5
50	L-54	Nannapaneni Sampurna	2484/2013	8.7	2-1-52	385-6A1E
51	R-67	Alapati Adhiseshu	77/2015	4.87	23-1-2	380-5
52	R-66	Alapati Adhiseshu	55/1988	5.95	23-1-3	380-5
53	R-69	Alapati Venkata Naga Lakshmi	804/1996	0.37	23-1-2/2	380-5
54	L-30	Rachapudi Lakshmi Bhanumathi	705/1994. 687/1994	9.36	2-1-26	385-6A1D
55	R-57/A	Yama Rama Mohanrao	2053/2002	0.55	23-1-17	380-5
56	R-57	Yama Rama Mohanrao	2053/2002	1.48	23-1-19	380-5
57	R-18	P. Heramba Naga Srinivasarao	2148/2002	32.39	24-1-49	380-5
58	L-23	Sanka Naga Kameswararao	101/1987	10.73	2-1-22	385-6A1C
59	1.-21	Majeti Koti Lingam	1112/1994	16.41	2-1-20	385-6A1C
60	R-10	Rachapudi Vigneswararao	431/1983	72.83	24-1-56/A	380-5
61	R-10/A	Rachapudi Bhuvaneswari Devi	430/1983	75.48	24-1-56	380-5
62	R-7	Talluri Sarojini Devi	1274/1999	36.24	24-1-58	380-5

కావున పై తెలిపిన వారికి టిడిఆర్ బాండ్లు మంజూరు చేయు విషయములో ఏమైనా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు ఉన్నఎడల ఏడు (7) రోజులలోపు పొన్నూరు పురపాలక సంఘ కార్యాలయమునకు దాఖలు చేయవలెనని తెలియజేయడమైనది.

సం/- కమీషనరు, పొన్నూరు పురపాలక సంఘం.

సమస్యల పరిష్కారానికి ప్రతినెలా ప్రత్యేక గ్రీవెన్స్

● జీఎంసీ అదనపు కమిషనర్ ఓబులేష్

గుంటూరు కార్పొరేషన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో పనిచేసే కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతినెలా ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని, కార్మికులు, ఉద్యోగులు తమ సమస్యలపై నేరుగా తమకు అర్జీలు, ఫిర్యాదులు అందించవచ్చని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. గురువారం కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ కార్మికులు, ఉద్యోగులు సమస్యల పరిష్కారం కొరకు వర్కర్స్ గ్రీవెన్స్‌ని కమిషనర్ ఛాంబర్ లో ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ఆర్జీలను, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని విభాగాధిపతులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్‌వో డాక్టర్ రవిబాబు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

ఫ్యాప్టో నూతన కమిటీ ఎన్నిక

గుంటూరు (విద్య) మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమాఖ్య(ఫ్యాప్టో) గుంటూరు జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం నిర్వహించారు. జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ ఎం కళాధర్ అధ్యక్షతన యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. నూతన కమిటీ ఛైర్మన్‌గా కె.నరసింహారావు(ఏపీటీఎఫ్), సెక్రటరీ జనరల్‌గా కె.వీరాంజనేయులు(ఎస్సీ, ఎస్టీ సంఘం)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కో ఛైర్మన్లుగా బి.సత్యం(హెచ్ఎంఏ) షేక్ ఫైజుల్లా (డీటీఎఫ్), డిప్యూటీ సెక్రటరీ జనరల్స్‌గా యు.రాజశేఖర్ రావు (యూటీఎఫ్), బీ సుబ్బారెడ్డి (ఎస్టీయూ), ఎండీ ఖలీదు(ఏపీటీఎఫ్)లను, ఇంకా కార్యవర్గ సభ్యులను ఎన్ను ఎన్నుకున్నారు.

పరిహారం కొరకు దరఖాస్తు చేసుకోండి

గుంటూరు(తూర్పు), మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఈ శ్రమ కార్డు పొందిన కార్మికులు తమకు రావాల్సిన పరిహారం కొరకు దరఖాస్తు చేసుకోవాలని కార్మిక శాఖ కమిషనర్ ఏ గాయత్రీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబసభ్యులు, పాక్షిక, పూర్తి అంగవైకల్యం ఉన్న కార్మికులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో డీఆర్డీఏ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. తమ దరఖాస్తులను ఈనెల 31వ తేదీ లోపు అందజేయాలని కోరారు. వివరాలకు 94925 55157 నెంబర్లో సంప్రదించాలని తెలిపారు.

ఫిజియోథెరపిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

గుంటూరు(తూర్పు), మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపిస్టుల సమస్యల పరిష్కారానికై కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ ఫిజియోథెరపిస్ట్ ఫెడరేషన్ నూతన అధ్యక్షుడు డాక్టర్ బీవీ హరికృష్ణ అన్నారు. స్థానిక అరండల్ పేటలో గురువారం ఫెడరేషన్ సమావేశం నిర్వహించారు. ఫెడరేషన్ బలోపేతానికి అన్ని జిల్లాలలో సభ్యుల సహకారంతో ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్టు తెలిపారు. కార్యదర్శి షేక్ సుభాని మాట్లాడుతూ త్వరలో పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు డాక్టర్ సతీష్ కుమార్, దయాకర్, రాజేంద్రప్రసాద్, ఇమ్రాన్ ఖాన్, ఏడుకొండలు, ఖాజా, గ్రేస్, మురళీధర్, డాక్టర్ వినుకొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హామీల అమలుదిశగా కూటమి ప్రభుత్వం

టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు దారునాయక్

గుంటూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే కూటమి ప్రభుత్వానికి మూడు స్తంభాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం దారూనాయక్ అన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో భాగంగా ఏప్రిల్ తొలివారంలో మెగా డీఎస్సీ విడుదల చేయనుందన్నారు. రూ. 861 కోట్లతో 20 వేల కిలోమీటర్ల మేర గుంతలు పూడ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. మే నెలలో తల్లికి వందనం పథకం, అన్నదాత సుఖీభవ అమలు చేయనున్నట్లు తెలిపారు. గిరిజనుల సంక్షేమంలో భాగంగా అరకు కాఫీని ప్రోత్సహించి ఐదేళ్లలో లక్ష ఎకరాల్లో సాగు చేపట్టనున్నట్లు తెలిపారు.

బీసీ వసతిగృహం విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలి

గుంటూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మృతిచెందిన వట్టిచెరుకూరు మండల ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం విద్యార్థి బీ కిషోర్(14) కుటుంబాన్ని ఆదుకోవాలని జాతీయ బీసీ బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ బీసీ హాస్టల్లో నీటి సౌకర్యం లేకపోవడంపై హాస్టల్‌వార్డన్‌పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఏప్రిల్‌లో ఐఆర్‌సీటీసీ సప్త జ్యోతిర్లింగ యాత్ర

గుంటూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో పుణ్యక్షేత్రాల సందర్శనకు బయలుదేరే యాత్రికుల సౌకర్యార్థం సప్త జ్యోతిర్లింగ యాత్రని నిర్వహిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ ఎం రాజా తెలిపారు. గురువారం గుంటూరు రైల్వేస్టేషన్‌లో ఆయన సంస్థ అధికారులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ఈ యాత్ర ఏప్రిల్ 8వ తేదీన ప్రారంభమౌతుందన్నారు. మొత్తం 11 రాత్రులు, 12రోజులు కొనసాగుతుందన్నారు. యాత్రలో భాగంగా ఉజ్జయిని(మహాకాళేశ్వర్), ఓంకారేశ్వర్, ద్వారక (నాగేశ్వర్), సోమనాథ్, పూణే(భీమాశంకర్), నాసిక్ (త్రయంబకేశ్వర్), ఔరంగబాద్(ఘృష్ణేశ్వర్) సందర్శన ఉంటుందన్నారు. యాత్రకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం 92814 95848కి ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

సిబ్బంది కుటుంబాలకు అండగా పోలీస్ శాఖ

గుంటూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మరణించిన పోలీస్ సిబ్బంది కుటుంబాలకు పోలీస్‌శాఖ అండగా ఉంటుందని ఎస్పీ సతీష్‌కుమార్ హామీ ఇచ్చారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ విభాగం తరపున అనారోగ్య కారణాలతో మరణించిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ పి.చంద్రశేఖరరావు సతీమణి పి.జ్యోతికి రూ.లక్ష, రోడ్డు ప్రమాదంలో మరణించిన షేక్.ఇమ్రాన్‌వలి సతీమణి షేక్ మైమూన్‌కు రూ. లక్ష చెక్కులను ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఐ శివరామకృష్ణ, పోలీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మైలా సాంబశివరావు, సెక్రటరీ లక్ష్మణ్, ట్రెజరర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలి

గుంటూరు(తూర్పు), మార్చి 27(ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అక్రమ అడ్మిషన్లపై, వేసవిలో తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్ రఘువీర్ డిమాండ్ చేశారు. కొత్తపేటలో గురువారం విలేకర్లతో ఆయన మాట్లాడారు. తీవ్ర ఉష్ణోగ్రతను దృష్టిలో పెట్టుకొని మధ్యాహ్నం వరకు పాఠశాలలు నిర్వహించాలని నిబంధనలను ఖాతారుచేయని విద్యాసంస్థలను సీజ్ చేయాలన్నారు. ప్రణీత్, వెంకట్, అజయ్ సాయి గణేష్ పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పొందినవారితో ఎమ్మెల్యే గల్లా మాధవి

పేదల పాలిట సంజీవని సీఎంఆర్ఎఫ్

● రూ.42 లక్షల విలువైన చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): అనారోగ్య పీడితులైన పేదలకు సీఎం సహాయనిధి సంజీవనిలా మారిందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. నియోజకవర్గ కార్యాలయంలో గురువారం ఆమె ఈ చెక్కులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందించి ఇంటి పెద్ద కొడుకుగా ఆదుకుంటున్నారని కొనియాడారు.

● పట్టాభిపురం పోలీస్ స్టేషన్ సీఐగా నియమితులైన గంగా వెంకటేశ్వర్లు గురువారం ఎమ్మెల్యే గల్లా మాధవిని మర్యాదపూర్వకంగా కలిశారు. స్టేషన్ పరిధిలో ఆకతాయిలు, గంజాయి బ్యాచ్‌ని అరికట్టాలని ఈ సందర్భంగా ఆమె సీఐకి సూచించారు.

మెయిన్ రోడ్డు పెండింగ్ పనులు వెంటనే ప్రారంభించాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు



ఏటీ అగ్రహారం మెయిన్‌రోడ్డును పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఏటి అగ్రహారం మెయిన్‌రోడ్ పెండింగ్ పనులు వెంటనే ప్రారంభించాలని, విద్యుత్ స్తంభాలను షిఫ్ట్ చేసేలా సమన్వయం చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ ఏటి అగ్రహారం, శాంతి నగర్, లక్ష్మీనగర్, చుట్టగుంట తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్ విస్తరణలో ఉన్న కోర్ట్ కేసుల వివరాలతో నివేదిక ఇవ్వాలని ఏసీపీని ఆదేశించారు. పర్యటనలో డీఈఈ మధుసూదన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయకార్యదర్శులు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్లలో భోజనాన్ని నిర్దేశిత సమయంలో అందుబాటులో ఉండేలా చూడాలని, శుక్రవారం నుండే మార్చిన సమయాన్ని పాటించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులను, అక్షయపాత్ర సిబ్బందిని ఆదేశించారు. గురువారం చుట్టగుంట సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌ని పరిశీలించి ఆహార సమయాలపై ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులపై సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.

జీఎంసీ ప్రాపర్టీస్‌కి లీజు టెండర్లు

గుంటూరు నగరపాలక సంస్థకు చెందిన మార్కెట్లు, మరుగుదొడ్లు, సైకిల్ స్టాండ్‌లకు సంబంధించి మార్చి31, 2026 వరకు లీజుకు తీసుకోడానికి గురువారం స్థానిక నగరపాలక సంస్థ ట్రావెలర్స్ బంగ్లాలో సీల్డ్ టెండర్, బహిరంగ వేలంను నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులతో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డేగలను కలిసిన షేక్ సజీల



డేగల ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న షేక్ సజీలా

గుంటూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్, గుంటూరు నగర టీడీపీ అధ్యక్షుడు డేగల ప్రభాకర్‌ను ఆయన కార్యాలయంలో నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ మేయర్ షేక్ సజీల మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు.

మేయర్‌ను కలిసిన బీజేపీ జిల్లా నాయకులు

గుంటూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నగర మేయర్ షేక్ సజీలని బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరు తిరుపతిరావు నేతృత్వంలో ఆ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గురువారం నగరపాలకసంస్థ కార్యాలయానికి వచ్చిన బీజేపీ నాయకులు మేయర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కొత్తూరు వెంకటసుబ్బారావు, నేరెళ్ల మాధవరావు, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి వై.వి.సుబ్బారావు, చరకా కుమార్‌గౌడ్, సురేష్‌జైన్, పురుషోత్తం, మండడపు సురేష్, నాగేశ్వరరావు ఉన్నారు.



ఈవీఎం గోడౌన్‌లో యంత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఈవీఎం గోడౌన్ల వద్ద బందోబస్తు కొనసాగించాలి

● కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు

గుంటూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఈవీఎంల గోడౌన్ల వద్ద ఏర్పాటు చేసిన పటిష్టమైన బందోబస్తుని నిరంతరం కొనసాగించాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి రెవెన్యూ, పోలీసు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీలలో భాగంగా గురువారం కలక్టరేట్ ఆవరణలోని ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్‌ను ఆమె పరిశీలించారు. సీసీటీవీ పనితీరు, అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ షేక్ ఖాజావలి, గుంటూరు ఆర్‌డీవో కె శ్రీనివాస రావు, అదనపు ఫైర్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎలక్ట్రికల్ డీఈఈ ఏ నాగేశ్వర రావు, బిల్లా సునీల్(కాంగ్రెస్), నాయుడు ఓంకార్(టీడీపీ), కంచర్ల శివరామయ్య(టీడీపీ), చరక కుమార్‌గౌడ్(టీడీపీ), త్రినాథ్(జనసేన), అత్తోట జోసఫ్(వైసీపీ), చిరతనగండ్ల వాసు(బీఎస్‌పీ), డాక్టర్ సేవాకుమార్(ఏఏపీ), గుంటూరు పశ్చిమ మండల తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎలక్షన్ సెక్షన్ పర్యవేక్షకురాలు మల్లేశ్వరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు ఎదుట జనసేన ధర్మచలి వేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న దార్ల కనకలక్ష్మి

గుంటూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నగరంపాలెంలోని జిల్లా కోర్టు సముదాయం ఎదుట జనసేన రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి దార్ల కనకలక్ష్మీ ఆధ్వర్యంలో గురువారం ధర్మచలివేంద్రం ఏర్పాటుచేశారు. చలివేంద్రంలో బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు సంఘం నాయకులు సంకటి లక్ష్మణరావు, జనసేన నాయకులు పాడి సాంబశివరావు, త్రిపుర, డేగల వెంకటేశ్వరరావు, మహేష్, రావుల శేఖర్, భాస్కర్, జనసేన లీగల్ సెల్ నాయకులు పాల్గొన్నారు.

హీరో రామ్‌చరణ్ జన్మదిన వేడుకలు

గుంటూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): హీరో రామ్‌చరణ్ జన్మదినం సందర్భంగా గురువారం రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్‌లో మెగా అభిమానులు రక్తదానం నిర్వహించారు. రెడ్డిపాలెం రోడ్డులో వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో అఖిల భారత చిరంజీవి యువత నాయకుడు మేకల రవీంద్రబాబు, పులిగడ్డ నాగేశ్వరరావు, ఆళ్ల హరి, గిడుతూరి సత్యం, చుండూరు రామకృష్ణ, గోవర్ధన్ సతీష్, రాకేష్ పాల్గొన్నారు.

● గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ జన్మదిన వేడుకలు గురువారం ఆర్ అగ్రహారంలో జనసేన కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ ఆధ్వర్యంలో మెగా అభిమానులు, జనసైనికులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అభిమానులకు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మెగా అభిమానులు ఉప్పు వెంకటరత్తయ్య, దళవాయి సుబ్రహ్మణ్యం, దొడ్డి కోటేశ్వరరావు, యర్రబోతు వాసు, పల్లపు దుర్గాప్రసాద్, యర్రగోపుల జయదీప్, ముక్తం బాషా, అడపా బాలకృష్ణ, కన్నా శేషు, యిర్రి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో నాణ్యమైన ఆహారం అందించాలి

● ఫుడ్ సేఫ్టీ కమిషన్ సభ్యుడు లక్ష్మీ రెడ్డి

గుంటూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లో చదువుకొనే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ సేఫ్టీ కమిషన్ సభ్యుడు ఎండేల లక్ష్మీరెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన గుంటూరు జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ వసతిగృహాలు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ గోడౌన్స్‌లో ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను మెనూ ప్రకారం ఆహారం ఇస్తున్నారా... లేదా అని ఆరాతీశారు. కాంట్రాక్టర్లు నిబంధనల మేరకు సరుకులు సరఫరా చేయకపోతే వాటిని తిరస్కరించాలని సూచించారు.తనిఖీల్లో జిల్లా సరఫరాల అధికారి కోములి పద్మ, జిల్లా మేనేజర్ లక్ష్మి, ఎంఈవో, మిడ్‌డే మీల్స్ కోఆర్డినేటర్, విద్యాశాఖాధికారులు, ప్రాజెక్టు డైరెక్టర్, ఐసీడీఎస్, బీసీ, ఎస్సీ సంక్షేమశాఖ అధికారులు, తూనికలు కొలతలు, ఆహార భద్రతా అధికారులు పాల్గొన్నారు.

అజ్ఞానాంధకారాన్ని తొలగించేదే నిజమైన విద్య

● సీనియర్ సివిల్ జడ్జి సయ్యద్ జియావుద్దీన్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సయ్యద్ జియావుద్దీన్

గుంటూరు(విద్య), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): విద్య మనసును వెలిగించి, అజ్ఞానాంధకారాన్ని తొలగించి విజ్ఞాన జ్యోతిని వెలిగిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి సయ్యద్ జియావుద్దీన్ తెలిపారు. గురువారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని హిందూ బీఈడీ కళాశాల 17వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంకేతికతతో కూడిన విద్యను నేర్చుకోవాలని, విజయపథంలో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్య సభ్యులు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు ప్రసాద్, మాజేటి సోమశేఖరరావు, కార్యదర్శి చింతలపాటి వెంకటరామయ్య పాల్గొన్నారు.

ఈ శ్రమ పోర్టల్‌లో సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

● కార్మిక, మెడికల్ సర్వీసెస్ రాష్ట్ర అదనపు కార్యదర్శి గంధం చంద్రుడు

గుంటూరు(తూర్పు), మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఈ శ్రమ పోర్టల్‌లో సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని, రెండు నెలలలోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కార్మిక, కర్మాగార, బాయిలర్స్ ఇన్సూరెన్సు, మెడికల్ సర్వీసెస్ అడిషనల్ సెక్రటరీ గంధం చంద్రుడు ఆదేశించారు. గుంటూరు జెడ్పీ కార్యాలయంలో గురువారం గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల కార్మికశాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులను గుర్తించి వివరాలను ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. జోన్‌లో తనిఖీలను విస్తృతంగా నిర్వహించి బాల కార్మికులను గుర్తించి, సదరు యజమానులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జోన్ పరిధిలోని కార్మిక, కర్మాగారాల, బాయిలర్స్ బీమా, మెడికల్‌సర్వీసెస్ అధికారులు పాల్గొన్నారు.



పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు

వైభవంగా రంగస్థల పురస్కారాల ప్రదానం

గుంటూరు(తూర్పు), మార్చి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, అన్నమయ్య కళావేదికపై కళావిపంచి హైదరాబాద్, ఆరాధన ఆర్ట్స్ అకాడమీ, ఎన్టీఆర్ కళాపరిషత్ సంయు క్త ఆధ్వర్యంలో ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా రంగస్థల పురస్కారాల సభ జరిగింది. అతిథులుగా మాజీ మిర్చియార్డు ఛైర్మన్ మన్నవ సుబ్బారావు, రచయిత సినీ నటు డు యు.సుబ్బరాయశర్మ, భారత మంత్రిత్వ శాఖ నిపుణుడు డాక్టర్ ఎస్.రామచంద్రరావు, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు మస్తానయ్య పాల్గొని గురజాడ పురస్కారాన్ని పిన్నమనేని మృత్యుంజయరావుకు, బళ్లారి రాఘవ పురస్కారాన్ని బసవరాజు జయశంకరుకు, పీఎస్ఆర్ పురస్కారాన్ని వై.వీ.ఆర్. ఆచార్యులకు, గరికపాటి రాజారావు పురస్కారాన్ని సుంకర కోటేశ్వరరావుకు, గోవిందరావు పురస్కారాన్ని సురభి సంతోషుకు, రఘురామయ్య పురస్కారం తిరుమలాబీకి, వై.కే.నాగేశ్వరరావు పురస్కారాన్ని డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబుకు, జాముననరాయలు పురస్కారం జ్యోతికి జంధ్యాల పురస్కారాన్ని మల్లాది భాస్కర్‌కు అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొన్నారు.

31న ఉగాది పురస్కారాల ప్రదానం

స్థానిక అన్నమయ్య కళావేదికపై పలు రం గాలకు చెందిన విశిష్ట వ్యక్తులకు ఈనెల 31న ఉగాదిపురస్కారాలు అందజేయనున్నట్టు కళాదర్బార్ వ్యవస్థాపక అధ్యక్షుడు పొత్తూరు రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. టీవీ, వైద్యం, విద్య, సంగీతం, వ్యాపారం, కళారంగా ల్లో పురస్కారాలు అందిస్తున్నట్టు తెలిపారు.

వైద్య విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి

● కార్డియాలజిస్ట్ పీవీ రాఘవశర్మ

గుంటూరు మెడికల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మెడికల్ పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులు వైద్య పరిశోధన రంగం పట్ల మక్కువ కలిగి ఉండాలని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పీవీ రాఘవశర్మ సూచించారు. గురువారం గుంటూరు వైద్య కళాశాలలో ఆధునీకరించిన బయో కెమిస్ట్రీ ఫ్యాకల్టీ, పీజీ స్టూడెంట్స్ రీసెర్చ్ ల్యాబ్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి ప్రారంభించారు. ఈ పరిశోధన శాల ఆధునికీకరణకు డాక్టర్ రాఘవశర్మ రూ.10లక్షల విరాళం అందించారు. అదేవిధంగా బయోకెమిస్ట్రీ విభాగంలో అసోసియేట్‌ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ మోహనలక్ష్మీ, తన సోదరుడు జేహెచ్‌వీవీ రాఘవ జ్ఞాపకారం విరాళం కింద వైద్య పరికరాలను ల్యాబ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాఘవశర్మ మాట్లాడుతూ నేడు వైద్యరంగంలో నూతన ఆవిష్కరణలు జరుగుతున్నాయని, భవిష్యత్తులో రీసెర్చ్‌కు పెద్ద ఎత్తున ఆదరణ లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బయోకెమిస్ట్రీ బోధన సిబ్బంది పాల్గొన్నారు.

కోలాహలంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

● కొనసాగుతున్న కౌంటింగ్ ప్రక్రియ..

గుంటూరు(లీగల్), మార్చి 27(ఆంధ్రజ్యోతి): గుంటూరు బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక పోలింగ్ గురువారం కోలాహలంగా జరిగింది. మొత్తం 2020 మంది న్యాయవాదులకు 1639 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి తదితరులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం ఐదున్నర నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమై అర్ధరాత్రి కూడా కొనసాగింది. కడపటి వార్తల అందేసరికి ఉపాధ్యక్ష పదవికి చింతా రామకోటిరెడ్డి(934), మాలే దేవరాజు(621)పై, జాయింట్ సెక్రటరీ పదవికి ఐ విజయ్‌వర్మ(853), కొమ్మినేని చంద్రశేఖర్(656)పై, ట్రెజరర్ పదవికి గూడూరి అశోక్ కుమార్(803) జీవీఎస్ఆర్‌కే ఎస్ చంద్రన్(715)పై విజయం సాధించారు. లైబ్రరి సెక్రటరి పదవికి బొప్పా శ్రీనివాస రావు(793) ఎం పాపిరెడ్డి(782)పై 11 ఓట్ల మెజారిటీ సాధించగా పాపిరెడ్డి అభ్యంతరంతో రీ కౌంటింగ్ చేపట్టారు. స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరి పదవికి గండికోట శేషగిరిరావు(763) కుప్పాల హనుమంతరావు(743)పై 20 ఓట్ల మెజారిటీతో, లేడీ రెప్రజెంటేటివ్ పదవికి పురాణం కళ్యాణి(777) అడపా ఇందిర(754)పై 23 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. సీనియర్ ఎగ్జిక్యూటివ్ పదవులకు మోర్ల బాలసుందరి, దాదా కరీంమొహమ్మద్, బండ్ల కృష్ణ, పల్లె నరసింహారావు, పొట్టిమూర్తి సురేష్‌కుమార్ పోటీ పడగా పోలింగ్ ప్రారంభమయ్యాక బ్యాలెట్ పేపర్లో తప్పు దొర్లినట్టు గుర్తించి అభ్యర్థులందరి ఆమోదంతో ఐదుగుర్ని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. జూనియర్ ఎగ్జిక్యూటివ్ పదవులకు లింగాల మారుతీశివనాగప్రసాద్ (758), పెరుమాళ్ళ శివరంగ నాయకులు(744), షేక్ రెహనాబేగం(712) గెలుపొందారు. లేడీ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు మందా విజయ (937) కుందేపు కవిత (571)పై 366 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శి పదవికి జరిగిన త్రిముఖ పోరులో మోదుకూరి శ్రీనివాస రావు(640) యరసాని అజయ్ కుమార్(476)పై 164 ఓట్ల మెజారిటీతో గెలిచారు.



సీఎంఆర్ఎఫ్ పొందిన నారాయణమూర్తితో ఎమ్మెల్యే నసీర్

నూతన ఆవిష్కరణలు పేదలకు చేరువవ్వాలి

● ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల నూతన ఆవిష్కరణలు సామాన్యులకు చేరువయ్యేలా ఉండాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరులోని మలినేని విద్యాసంస్థలు, జీవీఆర్‌అండ్‌ఎస్ కాలేజీలో నిర్వహించిన ఫెస్ట్‌లకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఫార్మాకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, దానిని తమ జీవితాల్లోకి అన్వయించుకోవాలని సూచించారు. ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ తీసుకొచ్చిన వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అరచేతిలోనే ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. విద్యార్థులు కూడా అదే విధానంలో ఆలోచనలు చేసి ప్రపంచాన్ని తమ వైపు తిప్పుకోవాలని సూచించారు. జీవీఆర్ అండ్ ఎస్ కాలేజ్ ఛైర్‌పర్సన్ సింధూర, మలినేని కాలేజ్ ఛైర్‌పర్సన్ పెరుమాళ్, శైలజ, కరీమున్, భాస్కర్ నాయుడు, వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

● సీఎంఆర్ఎఫ్‌తో కొండంత అండ

అనారోగ్య పీడితులైన పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ కొండంత అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని పలువురు బాధితులకు గురువారం ఆయన సీఎంఆర్ఎఫ్ నిధులు అందజేశారు. బాలాజీ నగర్‌కు చెందిన నారాయణమూర్తికి రూ.3లక్షల చెక్కును అందజేశారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మన్నవ మోహనకృష్ణ

బాధితుల సమస్యలు పరిష్కరిస్తాం

● మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): బాధితుల సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తామని ఏపీటీఎస్, ఏపీ లిడ్‌క్యాప్ ఛైర్మన్లు మన్నవ మోహనకృష్ణ, పిల్లి మాణిక్యరావు తెలిపారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం వారిరువురూ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. వినుకొండ మండలం ఏనుపాలెంలో తన కూతురిపై సామూహిక అత్యాచారం చేసి చంపి కాలువలో పడేశారని, పోలీసులకు ఫిర్యాదు చేసి పది నెలలైనా ఇంకా దోషులను పట్టుకోలేదని, త్వరగా పోలీసులు విచారణ జరిపి దోషులకు కఠిన శిక్షపడేలా చేయాలని కాకినాడ జిల్లాకు చెందిన మహిళ గురువారం ఫిర్యాదు చేశారు. ఆమెతోపాటు అనంతపురం, కాకినాడ, కడప, కృష్ణా జిల్లాల నుంచి ఫిర్యాదుదారులు వచ్చి తమ సమస్యలు తెలుపుకున్నారు. అధికారుల వేధింపులు, వైసీపీ పాలనలో పెట్టిన అక్రమకేసులపై పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయి.

వెబ్‌సైట్‌లో ఉచిత శిక్షణకు ఎంపికైన అభ్యర్థుల జాబితా

● 28లోగా రెండో విడత కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య), మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో సాంఘిక, గిరిజన సంక్షేమశాఖలు సంయుక్తంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ డి మధుసూదనరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేయబడిన శిక్షణ సంస్థల్లో స్టడీ సర్కిల్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉచిత డీఎస్సీ శిక్షణ కోసం షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థుల జాబితాలు జ్ఞానభూమి వెబ్ పోర్టల్ http-s://-m-d-f-c.a-p-c-f-s-s.in లో ఉంచినట్లు తెలిపారు. ఉచిత శిక్షణ కొరకు కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లకు తమ ప్రాధాన్యతలను తెలిపి పోర్టల్స్ నందు 2వ విడతగా రిజిస్టర్ చేసుకునేందుకు ఈనెల 28 చివరి తేదీగా నిర్ణయించారు.

విజ్ఞానాన్ని సమాజ శ్రేయస్సుకు ఉపయోగించండి

● వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు



సావనీరు విడుదల చేస్తున్న వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి

పెద కాకాని, మార్చి 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విజ్ఞానశాస్త్రాన్ని, సాంకేతికతను సమాజ శ్రేయస్సుకు వినియోగించాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు తెలిపారు. గుంటూరులోని జేకేసీ కళాశాలలో "కంప్యూటర్ రంగంలో అధునాతన పోకడలపై" జరుగుతున్న రెండురోజుల సదస్సులో గురువారం ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. విద్యార్థులు విజ్ఞానశాస్త్ర పరిజ్ఞానం, సాంకేతికతతో కంప్యూటర్ సైన్స్ రంగంలో ఉజ్వల భవిష్యత్తును పొందాలని సూచించారు. డాక్టర్ వై వెంకటేశ్వరరావు ఈ సదస్సుకు ఉప సంచాలకులుగా వ్యవహరించారు.. సదస్సులో కళాశాల అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాసరావు, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్, డైరెక్టర్ ఎస్.ఆర్.కె. ప్రసాద్, ప్రిన్సిపాల్ పరుచూరి గోపీచంద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సాంబశివరావు, ఆచార్య యలవర్తి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు ఈకేవైసీ చేయడంలో ఇబ్బందులు

● తూర్పు మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌కు నివేదించిన డీలర్లు

గుంటూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు ఈకేవైసీ చేయడంలో కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయని గుంటూరు జిల్లా చౌకధరల దుకాణదారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వైపీటీ ప్రసాదరావు అన్నారు. గురువారం గుంటూరు తూర్పు మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ మహబూబ్ సుభానిని డీలర్లసంఘం నాయకులు కలిసి సమస్యని నివేదించారు. ఈ-పోస్ యంత్రాలు ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు ఎండీయూల వద్ద ఉంటున్నందున తాము ఈకైవేసీ చేయలేని పరిస్థితి ఉందన్నారు. ఈకైవేసీని సచివాలయాల ద్వారా చేయిస్తే త్వరగా పూర్తి అవుతుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు దాసరి శ్రీనివాసరావు, అశ్వినికుమార్, కే రమేష్, ముక్తేశ్వరరావు, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఎల్1 కంపెనీలపై గప్‌చుప్!

- ఆరోగ్య శాఖలో రహస్యంగా టెండర్ల ఖరారు
- ప్రక్రియపై ఎమ్మెల్యేల ఫిర్యాదు.. విచారణ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వాసుపత్రుల్లో శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ నిర్వహణకు టెక్నికల్ కమిటీ టెండర్లను ఖరారు చేసింది. ఏయే కంపెనీలను ఎంపిక చేశారన్న విషయాన్ని మాత్రం అధికారులు బయటకు రానివ్వడం లేదు. ఎల్1 కంపెనీల పేర్లు బయట పెట్టకుండా రహస్యంగా ఉంచారు. గురువారం ఆరోగ్య శాఖ స్పెషల్ సీఎస్ నేతృత్వంలో కమిటీ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, సెకండరీ హెల్త్ డైరెక్టరేట్ పరిధిలో ఉన్న ఆసుపత్రులకు సంబంధించి మొత్తం 18 ప్యాకేజీలకు టెండర్లు ఖరారు చేశారు. అన్ని జోన్‌లకు ఎల్1 కంపెనీలను ఎంపిక చేశారు. ఇప్పటికే ఈ టెండర్ ప్రక్రియపై అనేక అనుమానాలు, ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎల్1 కంపెనీల పేర్లు రహస్యంగా ఉంచడం మరిన్ని సందేహాలకు తావిస్తోంది. దీనికితోడు ఏపీఎంఎస్ఐడీసీ టెండర్ ప్రక్రియ మొత్తాన్ని గందరగోళం చేసింది. శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ టెండర్లు మొత్తం మెడికల్ టెర్మనాలజీ, కెమికల్స్ వ్యవహారాల్లో అనుభవం ఉన్న అధికారికి అప్పగించాలి. అయితే దాదాపు రూ.1400 కోట్లు విలువైన టెండర్ల విషయంలో సాధారణ ఇంజనీర్‌కు అప్పగించారు. సదరు అధికారి తనకు నచ్చినట్లు టెండర్ నిబంధనలతో కంపెనీలకు అర్హత కల్పించారన్న విమర్శలున్నాయి. టెండర్ల ప్రక్రియపై ఉత్తరాంధ్ర, రాయలసీమ ఎమ్మెల్యేలు అనేక మంది ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు.

నిబంధనలు మార్పు

శానిటేషన్, సెక్యూరిటీ టెండర్లల్లో నిబంధనలను అధికారులు ఇష్టారాజ్యాంగా మార్చేశారు. అధికారులు టెండర్ డాక్యుమెంట్‌లో పొందుపరిచిన నిబంధనలకు వారే తిలోదకాలు ఇచ్చారు. తొలుత టెండర్ డాక్యుమెంట్‌లో జోన్‌ల వారీగా ఎంతమంది శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలి? వారికి ఎంత జీతం ఇవ్వాలి? ఎంత మొత్తంలో కెమికల్స్ ఉపయోగించాలి? దానికి అయ్యే ఖర్చు ఎంత? అన్న వివరాలు ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు పొందుపరిచారు. బిడ్ దాఖలు చేసే కంపెనీ కేవలం సర్వీస్ చార్జీ ఎంత అన్న విషయాన్ని మాత్రమే బిడ్‌లో పొందుపరచాలని స్పష్టంగా చెప్పారు. దాని ఆధారంగానే ఎల్1 కంపెనీ ఎంపిక జరుగుతుందని స్పష్టం చేశారు. అది కూడా సర్వీస్ చార్జీ 3.38 శాతం నుంచి 7.7 శాతం మించకూడదన్న నిబంధన పెట్టారు. చివరికి బిడ్ దాఖలు చేసే సమయంలో జోన్ల వారీగా ఎంతమంది సిబ్బందిని నియమిస్తారు? వారికి ఎంత మొత్తంలో జీతాలు చెల్లిస్తారు? ఎంత మొత్తంలో కెమికల్స్ ఉపయోగిస్తారు? అన్న వివరాలు కూడా పొందుపరచాలన్న నిబంధనలు పెట్టారు.

ఫిర్యాదులు పరిశీలిస్తాం

టెండర్ ప్రక్రియలో పాల్గొన్న ఒక కంపెనీపై కొంతమంది ఎమ్మెల్యేలు ఫిర్యాదులు చేశారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, విచారణ చేస్తామి, ఆ తర్వాత టెండర్ ప్రక్రియపై ముందుకు వెళ్తామని ఆరోగ్య శాఖ స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబు తెలిపారు.

16 రోజులు డిటెన్షన్ సెల్‌లో!

- రాత్రి నిద్రపోకుండా లైట్లు వేసి ఉంచారు... బల్లులు, పురుగులతో నిద్రలేమి
- పగటిపూట చెట్టు కింద పడుకున్నా... తెలంగాణ సీఎం రేవంత్ ఆవేదన



హైదరాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): తనది కక్ష సాధించే మనస్తత్వమే అయితే మొత్తం కేసీఆర్ కుటుంబం ప్రస్తుతం చర్లపల్లి జైల్లో ఉండేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి కక్ష, పగ, ప్రతీకారాలకు పోతున్నారని బీఆర్ఎస్ నేత కేటీఆర్ చేసిన ఆరోపణలపై సీఎం తీవ్రంగా స్పందించారు. తాము నిజంగా కక్ష సాధింపునకు పాల్పడితే తనను ఉంచిన చంచల్‌గూడ జైల్లోనో, చర్లపల్లి జైల్లోనే బీఆర్ఎస్ నాయకులు ఉండేవారని అన్నారు. "డ్రోన్ ఎగరేస్తే రూ.500 జరిమానా విధిస్తారు. బీఆర్ఎస్ వాళ్లు అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఎంపీనని కూడా చూడకుండా నన్ను చర్లపల్లి జైల్లో పెట్టారు. కరుడు గట్టిన నేరగాళ్లను బంధించినట్లు బంధించారు. 16 రోజులపాటు కంటికి మనిషి కనిపించకుండా నక్సల్స్‌ను ఉంచే డిటెన్షన్ సెల్లో ఉంచారు. జైల్లో రాత్రంతా లైట్లు ఆన్‌లో పెట్టి ఒక్క రాత్రి కూడా పడుకోకుండా చేశారు. దీపాల వెలుగుకు బల్లులు, పురుగులు వచ్చి చేరడంతో బలవంతంగా కళ్లు మూసుకున్నా నిద్ర వచ్చేది కాదు. దాంతో పగలు చెట్టు కింద పడుకుని నిద్రపోయేవాడిని. వాళ్ల తప్పులను దేవుడే చూస్తాడని, అంతకు అంత అనుభవిస్తారని భావించి ఊరుకున్నా. నా మీద కక్ష చూపిన వారిని దేవుడే ఆసుపత్రి పాలు చేశాడు" అన్నారు. 2015లో చంచల్‌గూడ జైల్లో ఉన్నపుడు తన బిడ్డ లగ్నపత్రిక రాసుకోవడానికి బెయిలు కోసం ప్రయత్నిస్తుంటే ఢిల్లీ నుంచి న్యాయవాదులను పిలిపించి వాదనలు చేసి అడ్డుకున్నారని గుర్తు చేశారు. జైలు నుంచి నేరుగా వేదిక వద్దకు వెళ్లి, తిరిగి జైలుకు తీసుకొచ్చారన్నారు. రాజకీయ కక్ష సాధింపులంటే మీవి కదా అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఇంత జరిగినా కక్ష సాధింపులకు పాల్పడకుండా విజ్ఞత ప్రదర్శించామని చెప్పారు. కేటీఆర్ తన ఆఫీసులో కొంత మందికి డబ్బులిచ్చి తనను, కుటుంబ సభ్యులను బూతులు తిట్టించి, రికార్డు చేయించిన వారిని చెంప పగులగొట్టే శక్తి ఉన్నా ఓపికతో ఉన్నా. కక్ష సాధింపు చర్యలు ఎవరివో తెలంగాణ సమాజం గమనిస్తోందని అన్నారు.

ఇన్‌చార్జి మంత్రి చైర్మన్‌గా అసైన్డ్ కమిటీలు

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసైన్డ్, మిగులు భూముల పంపిణీ వంటి అంశాలను సమీక్షించేందుకు ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు చైర్మన్లుగా ప్రభుత్వం కమిటీలను పునరుద్ధరించింది. ఈ మేరకు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా గురువారం ఉత్తర్వు(జీఓ104) జారీ చేశారు. జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించే మంత్రులు, సంబంధిత నియోజకవర్గ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఆర్డీఓ లేదా సబ్ కలెక్టర్లు సభ్యులుగా ఉంటారు. జిల్లా స్థాయిలో భూ వ్యవహారాలను పర్యవేక్షించే జాయింట్ కలెక్టర్ ఈ కమిటీ సభ్య కన్వీనర్‌గా ఉంటారని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే, తాజాగా ఈ కమిటీలో జిల్లా కలెక్టర్‌కు అవకాశం ఇవ్వలేదు. జిల్లా స్థాయిలో ఖాళీగా ఉన్న భూములను రెవెన్యూ శాఖ సిఫాసుల మేరకు ఈ కమిటీ పరిశీలించి అర్హులైన పేద లబ్ధిదారులకు పంపిణీ చేస్తుంది. మాజీ సైనికులకు ఇచ్చే భూములనూ ఈ కమిటీనే ఖరారు చేయనుంది.

ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్‌కు 88 కోట్లు

బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం పరిసవారిపాలెంలో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్ ఏర్పాటు కోసం రూ.88.08 కోట్ల మంజూరుకు ప్రభుత్వం పరిపాలన ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద కేంద్రం రూ.52.85 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.35.23 కోట్లు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్‌లో ఆమోదిత నిర్మాణాలను షరతులకు లోబడి పూర్తి చేయాలని మత్స్యశాఖ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

మాస్ లుక్‌లో...



రామ్‌చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. గురువారం రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులను ఖుషీ చేశారు మేకర్స్. సినిమాకు 'పెద్ది' అనే టైటిల్‌ను ఖరారు చేసి, రామ్‌చరణ్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. గుబురు గడ్డంతో చుట్ట వెలిగిస్తూ మాస్ లుక్‌లో కనిపించారు. ఈ లుక్ సినిమాపై ఉన్న అంచనాలను మరింత రెట్టింపు చేసింది. క్రీడా నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్నారు. జగపతిబాబు, కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాణ సంస్థలు మైత్రీమూవీ మేకర్స్ సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకటసతీష్ కిలారు నిర్మిస్తున్నారు.

సినీ ప్రముఖుల శుభాకాంక్షలు

రామ్‌చరణ్‌కు సినీ ప్రముఖులు సోషల్‌మీడియా వేదికగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. "పుట్టిన రోజు శుభాకాంక్షలు చరణ్. 'పెద్ది'లో నీ లుక్ అదిరిపోయింది. నీలోని నటుడిని ఈ సినిమా మరింత కొత్తగా చూపించనుందనే నమ్మకం ఉంది. సినీ ప్రియులకు కన్నుల పండుగగా ఉండే ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని చిరంజీవి పేర్కొన్నారు. అలాగే ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మహేశ్‌బాబు, జూనియర్ ఎన్టీఆర్, సాయి దుర్గాతేజ్, దర్శకుడు అనిల్ రావిపూడి, హీరోయిన్ కాజల్ అగర్వాల్ తదితరులు రామ్‌చరణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు చెప్తూ పోస్టులు పెట్టారు.

జూన్ 2న ఇళయరాజాకు సన్మానం



ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాను తమిళనాడు ప్రభుత్వం జూన్ రెండో తేదీన సన్మానించనుంది. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గురువారం శాసనసభలో ప్రకటించారు. ఇళయరాజా 50 ఏళ్ల సినీ ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆయన పుట్టిన రోజైన జూన్ రెండో తేదీన ఈ వేడుకలను నిర్వహించనున్నట్టు సీఎం చెప్పారు. వీసీకే సభ్యుడు చింతనై సెల్వం మాట్లాడుతూ.. 'సంగీత దర్శకుడు ఇళయరాజా తన సింఫనీ అరంగేట్రం కార్యక్రమాన్ని లండన్ వేదికగా విజయవంతంగా పూర్తి చేశారని, ఆ సింఫనీని తమిళ ప్రజలు వినేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందా? అని ప్రశ్నించారు. దీనికి సీఎం స్టాలిన్ సమాధానమిస్తూ.. 'సింఫనీ అరంగేట్రాన్ని పూర్తి చేసుకుని వచ్చిన ఇళయరాజాకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సాదర స్వాగతం పలికాం. సింఫనీ కార్యక్రమాన్ని రాష్ట్రంలో నిర్వహించాలని కోరాం. తక్షణం 4 వేల మంది కళాకారులను రాష్ట్రానికి పిలిపించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం శ్రమతో కూడుకున్నపని అని ఇళయరాజా అన్నారు' అని సీఎం తెలిపారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఫలితాలు కూడా చెత్తగానే ఉంటాయి

సల్మాన్ ఖాన్



చెత్త సినిమాలు తీస్తే ఫలితాలు కూడా చెత్తగానే ఉంటాయి అంటూ.. బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన నటించిన తాజా చిత్రం 'సికందర్' ఈనెల 30న విడుదలవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా మీడియాతో మాట్లాడుతూ 'సరైన చిత్రాలు తెరకెక్కించలేనప్పుడు అవి బాక్సాఫీసు వద్ద పరాజయాలే మూటగట్టుకుంటాయి. అందరూ కలసి కష్టపడితేనే మంచి సినిమా వస్తుంది. అయినప్పటికీ హీరో ఫొటోను మాత్రమే పోస్టర్‌లో వేస్తారు. ప్రేక్షకులు కూడా అది చూసే థియేటర్లకు వస్తుంటారు. ఒకవేళ సినిమా ఫ్లాప్ అయితే అందరూ ఆ హీరోనే తప్పుపడతారు' అని సల్మాన్ ఖాన్ వ్యాఖ్యానించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



ఆ మాటలు నన్ను కదిలించాయి

జూనియర్ ఎన్టీఆర్

ఓ జపనీస్ అభిమాని చెప్పిన మాటలకు చలించిపోయారు జూనియర్ ఎన్టీఆర్. ఆయన కొరటాల శివ దర్శకత్వంలో నటించిన 'దేవర' చిత్రం నేడు జపాన్‌లో విడుదలవుతోంది. అక్కడ నిర్వహించిన సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో ఎన్టీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయుధ పూజ పాటకు ఓ అభిమానితో కలసి స్టెప్పులేసిన వీడియో వైరల్ అయిన విషయం తెలిసిందే. కాగా, తన జపాన్ పర్యటనపై ఆనందం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు ఎన్టీఆర్. "ఆర్‌ఆర్‌ఆర్' సినిమా చూసిన తరవాత తెలుగు నేర్చుకున్నానని ఓ జపనీస్ అభిమాని చెప్పడం నన్ను కదిలించింది. విభిన్న సంస్కృతులతోపాటు భాష నేర్చుకునేందుకు సినిమా దోహదపడుతున్నందుకు సంతోషిస్తున్నా. ఇలాంటి వాటి కోసమే భారతీయ సినిమాను ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాం' అని పేర్కొన్నారు.

సినిమాగా డొక్కా సీతమ్మ కథ



అన్నపూర్ణగా, అన్నదాతగా చరిత్రలో నిలిచిపోయిన గొప్ప మహిళ డొక్కా సీతమ్మ. ఏ సమయంలోనైనా తన ఇంటికి ఎంతమంది వచ్చినా.. లేదు.. అనకుండా వారికి తనే స్వయంగా వండి వడ్డించిన ఆ మహాతల్లి జీవిత కథ ఇప్పుడు సినిమాగా వస్తోంది. అయితే చిత్ర నిర్మాణం ప్రారంభం కాకముందే ఈ ప్రాజెక్ట్ విషయంలో వివాదం మొదలైంది. దాని గురించి రచయిత రామకృష్ణ మాట్లాడుతూ 'సీతమ్మ కథను 'అన్నపూర్ణ డొక్కా సీతమ్మ' పేరుతో మొదట నాటకం రాశాను. 2016లోనే డొక్కా సీతమ్మ సినిమా స్క్రిప్ట్‌ను తెలుగు సినీ రచయితల సంఘంలో రిజిస్టర్ చేశాను. ఎంతో కాలంగా ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి చరిత్రను పరిశోధించి స్క్రిప్ట్ తయారు చేశాను' అని చెప్పారు. చరిత్ర సాకుతో తమ రచనను కాపీ కొడుతూ వేరొక సంస్థ కూడా సినిమా తీయడానికి ప్రయత్నించడంతో ఈ వివాదం కోర్టుకు చేరిందని నిర్మాత ప్రభాకర్ గౌడ్ చెప్పారు. కాపీ రైట్ యాక్ట్ కింద తమకు హక్కు ఉన్నప్పటికీ విషయం కోర్టులో ఉన్నందువల్ల తాము కోర్టు తీర్పును శిరోధార్యంగా భావిస్తున్నామని ఆయన తెలిపారు. అయితే వేరొక సంస్థ సినిమా తీసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అదే నిజంగా జరిగితే కోర్టు ధిక్కారం అవుతుందని ఆయన హెచ్చరించారు. కోర్టు తేల్చే వరకూ యథాతథ పరిస్థితిని కొనసాగించాలని కోరారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

రూరల్ మండల ఉపాధ్యక్షుడిగా కాకాని రమేష్



కాకాని రమేష్‌కు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి వజ్రశ్రీ

గుంటూరు (తూర్పు), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండల ఉపాధ్యక్షుడిగా వెంగళాయపాలెం-1 ఎంపీటీసీ సభ్యుడు, వైసీపీ మద్ధతుదారు కాకాని రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కలెక్టరేట్ బంగ్లా రోడ్డులోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎన్నిక నిర్వహించారు. మొత్తం 7మంది ఎంపీటీసీలకుగాను నలుగురు సభ్యులు హాజరయ్యారు. రమేష్ పేరును మండల ఎంపీటీసీ ఇంటూరి పద్మావతి ప్రతిపాదించగా, గొర్లవారిపాలెం ఎంపీటీసీ దర్శి సుజాత బలపరిచారు. అనంతరం కాకాని రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి వజ్రశ్రీ ప్రకటించారు. అనంతరం రమేష్‌కు ఆమె ధ్రువీకరణ పత్రాన్ని అందజేసి, ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, మండల విస్తరణ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుండ్లపాలెం ఉప సర్పంచ్‌గా రమాదేవి



రమాదేవిని అభినందిస్తున్న టీడీపీ నాయకులు

మేడికొండూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలంలోని గుండ్లపాలెం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా 7వార్డు సభ్యురాలు దొప్పలపూడి రమాదేవి గురువారం జరిగిన ఎన్నికలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఉపసర్పంచ్‌గా పని చేసిన కొటికల మేరిమ్మ రాజీనామా చేయడంతో తిరిగి ఎన్నిక నిర్వహించారు. ఇద్దరు సభ్యులు గైర్హాజరు కాగా ఏడుగురు సభ్యులు హాజరయ్యారు. ఎన్నికైన రమాదేవిని మాజీ జడ్పీటీసీ సభ్యులు పాములపాటి శివన్నారాయణ, ఫిరంగిపురం మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ నార్నె శ్రీనివాసరావు, సర్పంచ్ వెంకటకృష్ణయ్య తదితరులు అభినందించారు.

తిమ్మాపురం ఉపసర్పంచ్‌గా మండ్రు అనిత



ఉపసర్పంచ్‌గా ఎన్నికైన అనితకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి రవికుమార్

ప్రత్తిపాడు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిమ్మాపురం పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఉపసర్పంచ్ ఎన్నికల్లో నాలుగో వార్డు మెంబరు మండ్రు అనిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ పంచాయతీ ఉప సర్పంచ్ రాజీనామా చేయడంతో ఆ స్థానంలో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల అధికారి రవికుమార్ ఈ ఎన్నికలు నిర్వహించారు. వార్డు సభ్యులు అందరూ ఏకాభిప్రాయంతో అనితను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కల్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా మంత్రి నారా లోకేశ్

మంగళగిరి సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న టీడీపీ కార్యకర్తలకు పార్టీ కార్యకర్తల సంక్షేమ నిధి కన్వీనర్, మంత్రి నారా లోకేశ్ అండగా నిలుస్తున్నారని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు అన్నారు. మంగళగిరి పట్టణంలోని 22వ వార్డు రత్నాలచెరువులో టీడీపీ సభ్యత్వ కార్డులను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అంకమ్మరావు, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమగ్ర సర్వే ప్రారంభం

మంగళగిరి సిటీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో చేనేత, అనుబంధ వృత్తులు చేస్తున్న కార్మికులను గుర్తించేందుకు అధికార యంత్రాంగం సమగ్ర సర్వే చేపట్టింది. చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో 11 మంది సభ్యుల బృందం మంగళగిరి రత్నాలచెరువు పరిధిలోని 21, 22 వార్డుల నుంచి ఈ సర్వేను ప్రారంభించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మగ్గం ఉన్న చేనేత కార్మికులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నట్టు ప్రకటించింది. ఈ పథకంతో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 95 వేల చేనేత కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. దీంతో చేనేత కార్మికుల పేర్లను నమోదు చేసేందుకు చేనేత జౌళి శాఖ అధికారులు సమగ్ర సర్వేకు శ్రీకారం చుట్టారు.

వైన్‌షాపు తొలగించాలని మహిళల వినతి

తాడేపల్లి టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపక్కనే ఏర్పాటు చేసిన వైన్‌షాపులో తాగుతూ సమీపంలోని ఇళ్లలోకి దూరుతున్నారు. పేరుకు వైన్ షాపు అయినా.. బార్ షాపులా మార్చేశారు. తాడేపల్లి ప్రధాన రోడ్డు పక్కనే కొద్ది నెలల క్రితం వైన్‌షాపు ఏర్పాటు చేసే ముందు మహిళలు వద్దని మొరపెట్టారు. కానీ షాపు ఏర్పాటు చేశారు. కేవలం మద్యం కొనుక్కుని తీసుకెళ్లిపోతారని తమను నమ్మబలికారని, ఇప్పుడేమో అక్కడే తాగుతున్నారని మందుబాబుల మధ్య ప్రయాణించాలంటే ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుస్టేషన్‌లో తహసీల్దార్ కార్యాలయంలో వైన్‌షాపు తొలగించాలంటూ మహిళలు గురువారం వినతిపత్రాలు అందజేశారు.

ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా న్యాయమే గెలిచింది

● మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన మనోధైర్యం మరువలేను

● దుగ్గిరాల ఎంపీపీ ఎన్నికైన జబీన్



షేక్ జబీన్‌ను అభినందిస్తున్న టీడీపీ నాయకులు పోతినేని, అబద్దయ్య, జానకీదేవి, శ్రీఅనిత, వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, గూడూరు వెంకట్రావు

దుగ్గిరాల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా.. కుల ధ్రువీకరణపత్రం ఇవ్వకుండా వేధించినా చివరకు న్యాయమే గెలిచిందని దుగ్గిరాల ఎంపీపీగా నూతనంగా ఎన్నికైన షేక్ జబీన్ అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో జరిగిన ఎంపీపీ ఎన్నికల్లో షేక్ జబీన్ ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికైంది. జబీన్ మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్ తనకిచ్చిన ఆత్మస్థైర్యంతోనే ధైర్యంగా ఉన్నానన్నారు. నాడు యిచ్చిన మాట నిలబెట్టుకుంటూ, కూటమి అధికారంలోకి రాగానే బీసీ ధ్రువీకరణపత్రం అందించడమే కాక, ఎంపీపీగా మండల ప్రజలకు సేవచేసే అవకాశం కల్పించిన లోకేశ్‌కు రుణపడి ఉంటానని తెలిపారు. ప్రజాక్షేత్రంలోకి రావాలనుకునే నాలాంటి ఎందరో మహిళలకు మనోధైర్యానిచ్చారన్నారు. టీడీపీ నాయకులందరకూ జబీన్‌కు అండగా నిలిచారని, ప్రలోభాలకు గురిచేసినప్పటికీ నైతికతకు కట్టుబడి ఆత్మస్థైర్యం కోల్పోకుండా అండగా నిలిచిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జబీన్ ఏకగ్రీవంగా ఎన్నికైన అనంతరం టీడీపీ నాయకులు పెద్ద సంఖ్యలో మండల కార్యాలయానికి చేరుకుని అభినందించారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ న్యాయం గెలిచింది. ధర్మం నిలిచిందంటూ నినాదాలు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీ కుల ధ్రువీకరణపత్రం ఇవ్వకుండా, ముస్లిం మైనార్టీకి చెందిన జబీన్‌ను వేధించిందని, అప్పటి తహసీల్దార్ సైతం కుటుంబసభ్యుల బీసీ సర్టిఫికెట్లను చూపినప్పటికీ బీసీ అర్హత ఉన్నప్పటికీ ఏకపక్షంగా నిరాకరించిందని విమర్శించారు. పలువురు జబీన్‌కు అభినందనలు తెలిపారు. గుంటూరు పార్లమెంటు ప్రధానకార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డుసభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ గొర్రెని అనిల్, మండలపరిషత్ ఉపాధ్యక్షురాలు పసుపులేటి సాయిచైతన్య, రాష్ట్ర వాణిజ్యవిభాగ ప్రధానకార్యదర్శి గూడూరు వెంకట్రావు, మాజీ ఎంపీపీలు వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, ఉన్నం ఝాన్సీ, మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, ప్రధానకార్యదర్శి తాళ్ల అశోక్, జనసేన అధక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, బీజేపీ అధ్యక్షుడు పసుపులేటి గణేష్, జిల్లాప్రధాన కార్యదర్శి చుండూరు ఉమామహేశ్వరరావు, తోటకూర సీతారామయ్య, చిలువూరు శేషగిరి, సర్పంచులు మాణిక్యం, ఉమాదేవి, కృష్ణప్రసాద్, మాజీ జడ్పీటీసీ యేళ్ల జయలక్ష్మి, పోలిమెట్ల రత్నగిరి, యార్డు మాజీఛైర్మన్ కొండూరు ముత్తయ్య, మైనార్టీ సెల్ నాయకులు నిజాముద్దీన్, జలాలుద్దీన్, మాజీ సర్పంచులు శ్రీనివాసరావు, జోగారావు, సురేష్, కో- ఆప్షన్ సభ్యుడు వహిదుల్లా, పసుపులేటి రవియాదవ్, షేక్‌సాదిక్, నక్కా చిరంజీవి, కాసరనేని కృష్ణ, పర్వతనేని హర్ష, అశోక్, శ్రీనివాసరావు, కరుణాకర్, జీవన్, బిట్టూ, రవిచంద్, ఏసుపాదం, కోటేశ్వరరావు, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వైద్యమిత్రల నిరసన

మంగళగిరి సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు కింద పని చేస్తున్న ఫీల్డ్ ఉద్యోగులైన వైద్య, ఆరోగ్యమిత్రలు తమ సమస్యలపై గళమెత్తారు. తమ ఆందోళనలో భాగంగా ఈ నెల 17, 24 తేదీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో విధులు బహిష్కరించి నిరసనలు తెలియజేశారు. ఏపీ ఆరోగ్యమిత్ర కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపు మేరకు గురువారం మంగళగిరిలోని వైద్య సేవ ట్రస్టు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఆరోగ్యమిత్రలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చవ్వాకుల గోవిందు మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు సేవలందిస్తున్న ఆరోగ్యమిత్రల సమస్యలను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. వైద్యమిత్ర ఉద్యోగానికి ప్రభుత్వ జీవోలలో గుర్తింపు లేక, ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజీ రాక ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. అనంతరం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద జనవాణిలో వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యక్షుడు గార్లపాటి నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లూరి బంగారుషి, ప్రధాన కార్యదర్శి గుమ్మడి గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ముగిసిన ఆర్కిటెక్చర్ అంతర్జాతీయ సదస్సు

తాడేపల్లి (వడ్డేశ్వరం), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన అంతర్జాతీ సదస్సు గురువారం ఘనంగా ముగిసింది. న్యూసెమినార్ హాల్లో ఫ్యూచర్ ఎక్స్ రీ ఇమాజనింగ్ స్పేసెస్ అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సుకు గుజరాత్, అహ్మదాబాద్‌లోని ఎమిరిటస్ పీపీ సావని యూనివర్సిటీ ఆర్కిటెక్ట్ ఆచార్య గిరీష్ మిస్త్రీ, కేరళ కొచ్చి నుంచి బిల్డింగ్ సైంటిస్ట్ టెడెక్స్ స్పీకర్ ఆర్కిటెక్ట్ ప్రతీక్ సుధాకరన్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించారు. సదస్సుకు కేఎల్ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ విభాగాధిపతి ఆర్కిటెక్ట్ ప్రియా జాన్సన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్యూచర్ ఎక్స్ రీ ఇమాజనింగ్ స్పేసెస్, రీ డిఫైనింగ్ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాగజైన్ 2025ను ఆవిష్కరించారు.

ఫార్మసీ ఆచరణాత్మక పరిజ్ఞానం కలిగిన విద్య

● గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహమ్మద్

వట్టిచెరుకూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఫార్మసీ విద్య అనేది ఒక ఆచరణాత్మక పరిజ్ఞానం కలిగిన విభాగమని, ప్రజలకు ఆరోగ్య సంరక్షణలో ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అహమ్మద్ అన్నారు. మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని పెరుమాళ్ళు ఫార్మసీ కళాశాలలో రెండు రోజుల టెక్నో కల్చర్ అండ్ స్పోర్ట్స్ ఫెస్ట్‌లో గురువారం ఎమ్మెల్యే నసీర్ అహమ్మద్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. కళాశాల ఛైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు మాట్లాడుతూ కొవిడ్ వంటి కష్టకాలంలో ఫార్మసిస్టులు ముఖ్య పాత్ర పోషించి ఎందరినో కాపాడారన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డీ శ్రీనివాసరావు, అకాడమిక్ డైరెక్టర్ కిషోర్‌బాబు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించి రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు

మేడికొండూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలంలోని పలు పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న ఆహారం విషయంపై రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు లక్ష్మిరెడ్డి, పౌరసరఫరాల శాఖ డీఎస్‌వో పద్మ, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ జి.లక్ష్మి. లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ జి. సునిల్ రాజు తదితరులతో కలసి గురువారం సందర్శించారు. ముందుగా ఎన్‌టిఆర్ కాలనీలోని ఎలిమెంటరీ స్కూలుకు వెళ్లి విద్యార్థులకు అందిస్తున్న ఆహారంపై ఆయన విద్యార్థులను ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంఈవో అబ్దుల్ అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో నూతన కమిటీ ఎన్నిక

గుంటూరు(విద్య) మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమాఖ్య (ఫ్యాప్టో) గుంటూరు జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం నిర్వహించారు. జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ ఎం కళాధర్ అధ్యక్షతన యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. నూతన కమిటీ ఛైర్మన్‌గా కె.నరసింహారావు (ఏపీటీఎఫ్ 1938), సెక్రటరీ జనరల్‌గా కె.వీరాంజనేయులు(ఎస్సీ, ఎస్టీ సంఘం)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోఛైర్మన్లుగా బి.సత్యం, ఎస్కే ఫైజుల్లా, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్‌గా రాజశేఖర్‌రావు, బీ సుబ్బారెడ్డి, ఎండీ ఖలీద్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నృసింహుని హుండీ ఆదాయం రూ.38.70 లక్షలు

మంగళగిరి సిటీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో భక్తులు సమర్పించిన కానుకల హుండీలను గురువారం లెక్కించారు. రెండు నెలల కాలానికి గాను రూ.38లక్షల 70వేల 176లు ఆదాయంగా వచ్చింది. ఎగువ సన్నిధిలోని హుండీల ద్వారా రూ.16లక్షల 13వేల 384లు, దిగువ సన్నిధిలోని హుండీల ద్వారా రూ.21లక్షల 76వేల 972లు, ఉపాలయమైన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం హుండీల ద్వారా రూ.43వేల 11లు, నిత్యాన్నదాన పథకం కింద రూ.36,809లు ఆదాయంగా వచ్చినట్టు దేవదాయ శాఖ సహాయ కమిషనర్, ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి వివరించారు. ఈ హుండీల లెక్కింపును కాజ గ్రూపు దేవస్థానాల కార్యనిర్వహణాధికారి పీ వెంకటరెడ్డి పర్యవేక్షించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్త బృందం ప్రతినిధులు లెక్కింపులో పాల్గొన్నారు.

పరమపదనాథుడిగా నృసింహుడు



మంగళగిరి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీవారు పరమపదనాథుడిగా భక్తులను అలరించారు. దిగువ సన్నిధిలోని శ్రీకృష్ణదేవరాయ ముఖమండపంలో ఏర్పాటు చేసిన ఈ అలంకారోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ ప్రధాన అర్చకుడు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామిని పరమపదనాథుడిగా అలంకరించారు. ఈ ఉత్సవానికి ఆత్మకూరుకు చెందిన మురికిపూడి మాధవరావు జ్ఞాపకార్థం ఆయన కుమారులు కైంకర్యపరులుగాను, మంగళగిరికి చెందిన లంకా వెంకట సుబ్బారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు లంకా కృష్ణమూర్తి ఆస్థాన కైంకర్యపరులుగాను వ్యవహరించారు. ఆలయ ఈవో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



తాగునీటి పైపులైన్ లీకులతో వృథాగా పోతున్న నీరు

మురుగు కాలువలో ఉన్న పైపులైను



పైపులైను లీకులను అరికట్టరూ...

తెనాలి, మారీసుపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక చినరావూరు 12వ వార్డులోని బాలాజీనగర్‌లో తాగునీటి పైప్‌లైన్‌కు లీకేజ్ ఏర్పడి నీరు గత కొద్ది రోజులుగా వృథా అవుతున్నాయి. కొన్ని తాగునీటి పైపులైన్లు మురుగు కాలువల నుంచి వేయడంతో తాగునీటి సరఫరా నిలిచిన అనంతరం పైపుల్లోకి మురుగునీరు చేరతోంది. కలుషిత నీరు తాగి ప్రజలు అనారోగ్య సమస్యల బారిన పడకముందే సంబంధిత అధికారులు ఆ వార్డులో నెలకొని ఉన్న సమస్యపై దృష్టి పెట్టి తక్షణమే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రూరల్ సీఐగా ఉమేష్‌చంద్ర బాధ్యతల స్వీకారం



తెనాలి రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రూరల్ పోలీస్ స్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఉమేష్‌చంద్ర బాధ్యతలు గురువారం స్వీకరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యమిస్తానని ఉమేష్‌చంద్ర చెప్పారు. గతంలో తెనాలి, గురజాల, అద్దంకి సర్కిల్లో విధులు నిర్వహించారు.

డీఎస్పీని కలిసిన సీఐ

తెనాలి రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన ఉమేష్‌చంద్ర గురువారం డీఎస్పీ జనార్ధన్‌రావును కలిశారు. సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా కఠినంగా వ్యవహరించాని, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచుతూ సర్కిల్ పరిధిలో చట్టవ్యతిరేక కార్యాలకాలపాలకు తావు లేకుండా చూడాలని ఆదేశించారు.

శ్రీవాసవీ ఆలయంలో ఉగాది ఉత్సవాలకు ఏర్పాట్లు

తెనాలి అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బోసు రోడ్డులోని శ్రీవాసవీ ఆలయంలో ఉగాది ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. గురువారం ఆలయ ఆవరణలో మాట్లాడుతూ, ఈ నెల 30న ఉగాది పురస్కరించుకుని సహస్రగళ హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమంలో 1100మంది ఏకకాలంలో పాల్గొంటారన్నారు. పారాయణ అనంతరం ములుకుట్ల విశ్వనాథశర్మ పంచాంగ శ్రవణం, భక్తులకు అన్న ప్రసాద వితరణ జరుగుతుందని ఉప్పల వరదరాజులు, గొడవర్తి సాయిహరేరామ్, నూకల భాస్కర్ తదితరులు తెలిపారు.

రంగస్థల కళాకారుడు సుబ్రహ్మణ్యం మృతి



సుబ్రహ్మణ్యం (ఫైల్‌ఫొటో)

తెనాలి అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన రంగస్థల కళాకారుడు దీపాల సుబ్రహ్మణ్యం మృతి చెందారు. తిరుపతమ్మ నాటకం అద్భుతంగా ప్రదర్శించిన ఆయన నంది అవార్డు కూడా అందుకున్నారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం కోశాధికారిగా పని చేస్తున్నారు. కళాకారుల సంఘం ప్రతినిధిగా కళాకారుల సంక్షేమానికి విశేష కృషి చేశారు. అనారోగ్యానికి గురైన ఆయన గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందారు. బీసీ కాలనీలోని కళాకారుల సంఘ భవనంలో కళాకారుల సందర్శనార్థం ఆయన భౌతికకాయాన్ని ఉంచామని శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సంఘ నాయకులు తెలిపారు.

వైకుంఠపురం ఆలయ హుండీ ఆదాయం రూ.29.93 లక్షలు

తెనాలి అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.29.93 లక్షలు ఆదాయం లభించింది. ఆలయంలో గురువారం హుండీల లెక్కింపు నిర్వహించారు. మూడు నెలల కాలానికి గాను భక్తులు సమర్పించిన కానుకల హుండీ లెక్కింపు చేయగా రూ.29లక్షల58వేల 479లు, అన్నదానహుండీ రూ.35వేల 780లు, 58.5గ్రాముల బంగారం, 218.6గ్రాముల వెండి భక్తులు సమర్పించారని ఈవో వి.అనుపమ తెలిపారు. హుండీ లెక్కింపులో చెంచుపేట బ్యాంకు సిబ్బంది, స్కౌట్స్ క్యాడెట్స్, దేవదాయ సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఢీకొని ద్విచక్రవాహన చోదకుడికి గాయాలు

తెనాలి, మారీసుపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని ద్విచక్రవాహన చోదకుడికి గాయాలైన ఘటనపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం యడవూరు గ్రామానికి చెందిన మువ్వా సాంబశివరావు పనుల నిమిత్తం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డు నుంచి మార్కెట్ వంతెన వైపు వెళ్తుండగా తెనాలి నుంచి మంగళగిరి వైపు వెళ్తున్న కారు ఢీ కొనడంతో తలకు గాయమైంది. స్థానికులు గాయపడిన సాంబశివరావును పట్టణంలోని ఒక ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. బాధితుడు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శిథిలావస్థలో గ్రంథాలయ భవనం

● భవన నిర్మాణానికి గ్రామస్థుల ఎదురుచూపులు
● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

కొల్లిపర, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర ఉద్యమంలో ఉద్యమ కారులకి స్ఫూర్తిని నింపిన గ్రంథాలయాలు నేడు గ్రామాల్లో ఉనికిని కోల్పోతున్నాయి. ప్రతి ఒక్కరి ఉన్నతికి దోహదపడే గ్రంథాలయాలపై ప్రభుత్వాలు శీతకన్ను వేయడంపై పాఠకుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రాచీన కాలం నుంచి ఎన్నో విలువైన గ్రంథాలు శిథిల భవనాల్లో పాడై పోతూ బావితరాలకు అందకుండా పోతున్నాయి. కొల్లిపర మండలంలోని తూములూరు సెంటర్‌లోని కమలా నెహ్రూ శాఖా గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. భవనం ఎప్పుడు కూలిపోతుందోనని విద్యార్థులు, గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. పురాతనమైన భవనం కావడంతో గోడలు బీటలు వారి, పైకప్పు పూర్తిగా దెబ్బతింది. దీంతో వర్షం పడినప్పుడు గ్రంథాలయం లోపల పుస్తకాలు పూర్తిగా తడిచిపోతున్నాయి. దీంతో విలువైన పుస్తకాలను గ్రామస్తులు మరోచోట భద్రపరిచారు. శిథిలావస్థకు చేరుకున్న గ్రంథాలయ భవనం గురించి అనేక పర్యాయాలు ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోవపోవడంపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవతీసుకుని నూతన గ్రంథాలయ భవన నిర్మాణాన్ని చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



తూములూరులో శిథిలావస్థకు చేరుకున్న గ్రంథాలయ భవనం, బీటలు వారి భవనం గోడల్లో మొలిచిన మొక్కలు

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మానవత్వానికి, మత సామరస్యానికి రంజాన్ పండుగ ప్రతీకగా నిలుస్తోందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. పొన్నూరు పట్టణంలోని 27వ వార్డుకు చెందిన మొహిద్దీన్ జూయలరీ అధినేత షేక్ హుస్సేన్ గృహంలో గురువారం పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అనంతరం పేద ముస్లింలకు రంజాన్ పండుగ నిర్వహించుకునేలా గోధుమ పండి, సేమ్యా, కందిపప్పు, పచ్చి శనగపప్పు, పంచదార, బెల్లం, ఉల్లిపాయలు, మసాల దినుసులు, సగ్గుబియ్యం, నూనె వంటి 11 రకాల వస్తువుల కిట్‌లతో పాటు, దుప్పట్లును ఎమ్మెల్యే చేతులమీదుగా 250 మంది పేదలకు తోఫా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఏడాది పేదలు కూడా పండుగ చేసుకునేలా హుస్సేన్ తోఫా అందించడం అభినందనీయం అన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో మానత్వంతో పాటు ఇఫ్తార్ విందులతో మత సామరస్యం వెల్లివిరుస్తుందన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, ఎండీ గౌస్, రహంతుల్లా, శిలార్ భాషా, బాబ్జీ, భక్షి, కరీముల్లా బాజీ, జానీ బేగ్, తదితర ముస్లిం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రంజాన్ తోఫా అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్, తదితరులు

బొలగాని మృతి తీరనిలోటు

పొన్నూరు టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, సాగు నీటి సంఘాల డీసీ కమిటీ ఉపాధ్యక్షుడు బొలగాని రామారావు (46) గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. బొలగాని రామారావు మండల పరిధిలోని ములుకుదురు గ్రామంలో తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ములుకుదురు షిర్డీ సాయిబాబా మండల అధ్యక్షుడిగా దండమూడి నీటి సంఘం అధ్యక్షుడిగా వడ్లమూడి డీసీ ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. రామారావు మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ రామారావు మృతదేహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. రామారావు కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. రామారావుకు టీడీపీ పార్లమెంట్ రైతు ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు బండ్లమూడి బాబూరావు, చెలంశెట్టి సీతారామయ్య, తదితరులు నివాళులు అర్పించారు.

పేదల కోసం వైద్య శిబిరం అభినందనీయం

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



నిర్వాహకులతో కలిసి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వైద్యులు

తెనాలి రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత పేదల కోసం ఉచిత వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని ఎరుకలపూడిలో డాక్టర్ చందు సుబ్బారావు స్మారక ఆయుర్వేద వైద్యశాల, ఆశ్రమంలో నిర్వాహకురాలు డాక్టర్ చందు హేమ జన్మదినాన్ని పురస్కరించుకుని రమేష్ హాస్పటల్ సహకారంతో ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం హెల్త్ క్యాంపు ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని పూర్తి ఉచితంగా గ్రామంలో ఏర్పాటు చేసిన నిర్వాహకులు చందు సుబ్బారావు, డాక్టర్ హేమ, హనుమంతకుమార్‌లను ఆలపాటి అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ సుస్మిత, డాక్టర్ ప్రత్యూష, ఎంఎస్ ఆయుర్వేదిక్ డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ విశాల్‌దేవ్, డాక్టర్ దీప్తి, ఎండీ ఆయుర్వేదిక్ డాక్టర్ సునీత, డాక్టర్ రవిశంకర్, డాక్టర్ చక్రవర్తి డాక్టర్ రిషిరాహుల్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు దుస్తులు అందజేస్తున్న ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ జగదీష్‌కుమార్

వృద్ధాశ్రమానికి ఎస్‌బీఐ వితరణ

తెనాలి అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా సేవా శాంతి ఆశ్రమానికి ఎస్‌బిఐ రూ.2 లక్షలు విలువైన వస్తువులను అందించింది. ఆశ్రమంలో గురువారం ఎస్‌బీఐ సామాజిక సేవా పథకంలో భాగంగా వృద్ధులకు రీజనల్ మేనేజర్ జగదీష్‌కుమార్ దుస్తులు పంపిణీ చేశారు. ఆశ్రమానికి అవసరమైన రిఫ్రిజిరేటర్, వాటర్ ప్లాంటు, గ్రైండర్, దుప్పట్లు, గ్యాస్‌స్టౌవ్‌లు అందించారు. ఆశ్రమ వ్యవస్థాపకులు వజ్రాల రామలింగాచారి, చీఫ్ మేనేజర్లు వెంకటేశ్వరరావు, ఘోష్, జోన్ సెక్రటరీ చంద్రశేఖర్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తూములూరు గ్రామ ఉపసర్పంచ్‌గా శివారెడ్డి ఎన్నిక

కొల్లిపర, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తూములూరు గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా ఆరిమళ్ల శివారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో ఎన్నిక ప్రత్యేక అధికారి, పంచాయతీరాజ్ ఏఈ అవుతు సాంబిరెడ్డి అధ్యక్షతన, గ్రామ సర్పంచ్ భూక్యా అరుణాబాయ్ ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. 14 మంది వార్డు సభ్యులు గాను 13మంది వార్డు సభ్యులు హాజరై పార్టీలకు అతీతంగా శివారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలియజేశారు. నూతనంగా ఎన్నికైన ఉపసర్పంచ్ శివారెడ్డిని సర్పంచ్ అరుణాబాయ్, మాజీ ఉపసర్పంచ్ మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, కూటమి నాయకులు అభినందించారు.

మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడి ఎన్నిక ఏకగ్రీవం

తెనాలి రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కో ఆప్షన్ సభ్యుడి ఎన్నిక ఏకగ్రీవం అయింది. తేలప్రోలుకు చెందిన సయ్యద్ జానీబాషా ఒక్కరే కో ఆప్షన్ సభ్యుడిగా నామినేషన్ వేశారు. దీంతో ఎన్నిక జరగకుండానే ఏకగ్రీవం అయ్యారు. ఎన్నికల అధికారి ఉదయ్‌కుమార్ ఆయన కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నికైనట్లు ధృవీకరణ పత్రం అందించారు. ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, పలువురు ఎంపీటీసీలు నూతనంగా ఎన్నికైన కో ఆప్షన్ సభ్యుడికి శుభాకాంక్షలు తెలిపారు.

వైసీపీకి దక్కడం సంతోషంగా ఉంది: మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని

తెనాలి రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కో ఆప్షన్ పదవి వైసీపీ కార్యకర్త సయ్యద్ జానీబాషాకి దక్కడం సంతోషంగా ఉందని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. గురువారం జరిగిన మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుని ఎన్నికలో ఏకగ్రీవంగా గెలుపొందిన తేలప్రోలు గ్రామానికి చెందిన సయ్యద్ జానీబాషా పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా శివకుమార్ జానీ బాషాను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

బ్రాహ్మణకోడూరు ఉప సర్పంచ్‌గా నాగమల్లేశ్వరరావు

పొన్నూరు టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బ్రాహ్మణకోడూరు గ్రామ ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయ ఉప సర్పంచ్ ఎన్నికలో మూడో వార్డు సభ్యుడు ఓసూరి నాగమల్లేశ్వరరావు నామినేషన్‌ను దాఖలు చేశారు. ఒక నామినేషన్ దాఖలుకావడంతో ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు ఎంపీడీవో, ఎన్నికల అధికారి చంద్రశేఖర్‌రావు ఉప సర్పంచ్‌గా నాగమల్లేశ్వరరావును ప్రకటించి ప్రమాణ స్వీకారం చేయించారు.

ఘనంగా ప్రపంచ రంగస్థల దినోత్సవం

తెనాలి అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో గురువారం ప్రపంచ రంగస్థల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. బొల్లిముంత కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రంగస్థల నటుడు పాతూరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, నాటకరంగం దిశ దశను వివరించారు. రంగశెట్టి రమేష్, బెల్లంకొండ వెంకట్, భీమేశ్వరప్రసాద్, మధు, వసంత యామిని, విజయసారథి తదితరులు మాట్లాడారు. ఏకపాత్రాభినయం సన్నివేశాలను ప్రదర్శించారు.

మునిసిపల్ షాపుల వేలంలో రూ.19.46 లక్షల ఆదాయం

● కమిషనర్ శేషన్న



బహిరంగ వేలంను నిర్వహిస్తున్న మునిసిపల్ ఆర్‌వో రాంప్రసాద్, కమిషనర్ శేషన్న తదితరులు

తెనాలి, మారీసుపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ షాపుల బహిరంగ వేలంలో పురపాలక సంఘానికి రూ.19.46లక్షలు ఆదాయం లభించిందని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. గురువారం స్థానిక పుపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో నిర్వహించిన బహిరంగ వేలంలో కూరగాయల మార్కెట్లు, జంతు వధశాల, షాపులు, సత్యనారాయణ మునిసిపల్ లేక్ పార్కులోని ఫుడ్‌కోర్టు, వెహికల్ పార్కింగ్, క్యాంటీన్‌పై అంతస్తు షాపులకు గాను సంవత్సర కాల పరిమితికి వేలంలో రూ.19.46 లక్షలకు పాట కైవసం చేసుకున్నారు.

నేడు పండ్ల మార్కెట్టుకు వేలం: కమిషనర్

తెనాలి, మారీసుపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నేడు శుక్రవారం మునిసిపల్ పండ్ల మార్కెట్ షాపుల బహిరంగ వేలంను నిర్వహిస్తున్నట్టు మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మునిసిపల్ పండ్ల మార్కెట్టు షాపులు ఒక సంవత్సర కాల పరిమితికి వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనవచ్చని కమిషనర్ పేర్కొన్నారు.

తెనాలి బార్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం

తెనాలి క్రైం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెనాలి బార్ అసోసియేషన్ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ గురువారం తెలిపారు. బార్ అసోసియేషన్ హాలులో జరిగిన సమావేశంలో గత ఏడాది ఎన్నికైన సభ్యులకు తిరిగి 2025-26కి కొనసాగేలా సర్వసభ్య సమావేశంలో సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సమావేశానికి వందమంది న్యాయవాదులు హాజరై నూతన కమిటీని అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు తొలి సమావేశం జరిగింది. బార్ అసోసియేషన్‌కు నూతన భవనాలు నిర్మాణం, మరణించిన న్యాయవాదుల కుటుంబానికి ఇచ్చే బెనిఫిట్స్‌ని రూ.4 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచేలా చర్యలు, కోర్టు ప్రాంగణంలో కారు, మోటారు వాహనస్టాండ్ ఏర్పాటు, క్యాంటీన్, కక్షిదారులకు రెస్ట్‌రూమ్‌ల ఏర్పాటుపై ఏకగ్రీవ తీర్మానం జరిగింది. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అన్నం పిన్నారావు, కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, న్యాయవాదులు ఎం.శ్రీనివాసరావు, ఎం.సురేష్, చదలవాడ శ్రీనాథ్, షేక్ రెహానా బేగం, దాసరి ఉషారాణి, గోన పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాజీ సాహెబ్

పొన్నూరు టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా షేక్ బాజీ సాహెబ్ గురువారం విజయం సాధించారు. స్థానిక సివిల్ కోర్టులోని అసోసియేషన్ కార్యాలయంలో బార్ అసోసియేషన్ ఎన్నిక పోలింగ్ జరిగింది. షేక్ బాజీ సాహెబ్‌కు 33ఓట్లు పోలు కాగా, ప్రత్యర్థి తూమాటి రమేష్‌కు 18 ఓట్లు పోలయ్యాయి. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికయిన బాజీ సాహెబ్‌ను సహచర న్యాయవాదులు, గుమస్తాలు, కోర్టు సిబ్బంది అభినందించారు.

వృద్ధాప్యాన్ని ఆనందంగా గడపాలి: సుబ్బారావు

తెనాలి అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అనవసరమైన విషయాల జోలికి పోకుండా వృద్ధాప్యాన్ని ఆనందంగా గడపాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు ప్రత్యూష సుబ్బారావు పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం గురువారం కవిరాజా పార్కులో నిర్వహించారు. అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆనందంగా ఉంటే హార్మోన్లు విడుదల అవుతాయని తద్వారా ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. శారీరక వ్యాయామం, కుటుంబ సభ్యులు, స్నేహితులతో గడపటం, సమాజం పట్ల సేవా భావంతో వ్యవహరించడం అవసరమన్నారు. పూర్ణచంద్రరావు, కోటయ్య, కోటిరెడ్డి, ఆదినారాయణ, ఈశ్వర్‌చంద్, చలమయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి: సుదర్శన్

పొన్నూరు టౌన్, (చేబ్రోలు), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని రాష్ట్ర ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సుదర్శన్ అన్నారు. చేబ్రోలు ఆర్‌వీఐటీ కళాశాలలో గురువారం ఎంఎస్ఎంఈ కార్యక్రమంపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డైరెక్టర్ సుదర్శన్ ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు అందిస్తున్న ప్రోత్సహకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల విభాగం డైరెక్టర్ విజయ్‌కుమార్, రాఘవరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఆర్‌వీ కృష్ణయ్య, ప్రెసిడెంట్ ఆర్.వంశీకృష్ణ, తదితరులు హాజరయ్యారు.



పన్ను చెల్లింపుల కోసం శివాజీచౌక్‌లో ఏర్పాటుచేసిన కౌంటర్

పన్ను చెల్లింపునకు ప్రత్యేక కౌంటర్లు

తెనాలి, మారీసుపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలు పన్నులు చెల్లించేందుకు తెనాలి పురపాలక సంఘం పట్టణంలో పలు ప్రాంతాలలో రాష్ట్ర ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటుచేసి ప్రజలకు అందుబాటులో సిబ్బందిని ఏర్పాటు చేసింది. స్థానిక శివాజీచౌక్, చెంచుపేట, స్వరాజ్ టాకీస్ సెంటర్, లక్ష్మీ డీలక్స్ సెంటర్‌లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఈ కౌంటర్లలో తమ పన్ను బకాయిలు చెల్లించి, వడ్డీలో 50శాతం రాయితీ పొందాలని సిబ్బంది తెలియజేశారు. గతంలో వివిధ వార్డుల ప్రజలు నేరుగా పురపాలక సంఘానికి వెళ్లి పన్నులు చెల్లించాల్సి వచ్చేది. ప్రస్తుతం గ్రామ సచివాలయాలతో పాటు పలు ప్రాంతాలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్ల వద్దకు వెళ్లి పన్నులు చెల్లింపు అవకాశం కల్పించింది. ఈ నెల 31వ తేదీ వరకు ప్రత్యేక కౌంటర్ల సేవలు అందుబాటులో ఉంటాయి.



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న తదితరులు

నాణ్యతా ప్రమాణాలను పాటించండి

● మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులలో భాగంగా రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని మునిసిల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. గురువారం స్థానిక నాజరుపేట 9వ వార్డులోని రేలంగివారి వీధిలో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణానికి మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కమిషనర్ బండి శేషన్నతో కలసి భూమి పూజను నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.9.30 లక్షలుతో 128మీటర్లు నూతన రోడ్డు పనులు చేపట్టడం జరిగిందన్నారు. రోడ్డు నిర్మాణ పనులలో త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న, ఏఈ సూరిబాబు, మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది నిబంధనలు పాటించాలి

● ఎంపీడీవో విజయలక్ష్మి



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో విజయలక్ష్మి ఆదేశించారు. గురువారం మండల కేంద్రం కొల్లిపర సచివాలయంలో ఆమె తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి సచివాలయం సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది ప్రజల నుంచి ఎటువంటి సమస్యలు రాకుండా చూచుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలనను తప్పని సరిగా పాటించాలని లేకపోతే తగిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.




మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో సాల్మన్‌రాజు

నిబంధనల ప్రకారం ఆహారం అందించాలి

● ఎంఈవో సాల్మన్‌రాజు

కొల్లిపర, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఆహార పదార్థాలు పిల్లలకు అందించాలని, దీనిపై ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపర ప్రాథమిక పాఠశాలను ఎంఈవో ఆకస్మికగా తనిఖీచేశారు. విద్యార్థుల హాజరుపట్టీని, మధ్యాహ్న భోజనం పథకంపై సక్రమంగా అమలు చేస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులు వంట వండే విషయంలో చాలా జాగ్రత్తగా, అజాగ్రత్త ఉంటే ఏజెన్సీ నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన విద్యను అందించాని, విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. ఉపాధ్యాయులు పారిశుధ్యంపై కూడా శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాలల్లో సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు.



జాబ్‌మేళాలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

జాబ్‌మేళాలో 53 మంది ఎంపిక

పొన్నూరు టౌన్ (చేబ్రోలు) మార్చి 27: చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 53 మంది ఉద్యోగాలకు ఎంపికయినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.శ్రీదేవి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఉపాధి కార్యాలయం సీడాప్ సంయుక్తంగా నిర్వహించిన జాబ్‌మేళాకు 4 సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. 196మంది అభ్యర్థులు జాబ్‌మేళాకు రాగా 53మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ ఎంపికలలో జిల్లా ప్లేస్ మెంట్ అధికారి ఈశ్వరరావు, స్కిల్ హబ్ ప్రతినిధులు హనుమంతరావు, రాంచంద్, తదితరులు పాల్గొన్నారు.